ఈశా.. కైలాసవాసా..!
● కార్తీకం.. భక్తి పారవశ్యం
● ఆలయాలలో దీప కాంతులు
6లో
12 నుంచి ఉద్యోగులకు క్రీడాపోటీలు

ఉష్ణోగ్రత బుధవారం గరిష్ఠం : 29.0 కనిష్ఠం : 22.0
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY
5
శ్రీ సత్యసాయి
జిల్లా వార్తలు
గురువారం 6 నవంబరు 2025



పడిపోతున్నట్లు నటించి..
డబ్బు కాజేశారు..!
ఏడు నెలల తర్వాత ముగ్గురు అరెస్టు
7
కానిస్టేబుళ్ల తాత్కాలిక బదిలీ

# భద్రతా ఏర్పాట్ల పరిశీలన


ట్రస్టు ప్రతినిధులతో చర్చిస్తున్న ఎస్పీ సతీష్ కుమార్

పుట్టపర్తి రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సత్యసాయిబాబా శతజయంతి ఉత్సవాల నేపథ్యంలో ప్రశాంతి నిలయం వద్ద భద్రతా ఏర్పాట్లను ఎస్పీ సతీష్ కుమార్ పరిశీలించారు. ప్రశాంతి నిలయంలోని సాయికుల్వంత్ సభామండపం, శాంతిభవన్, హీరా కన్వెన్షన్ సెంటర్, సేవాదళ్ భవనం, మ్యూజియం, హిల్‌వ్యూ స్టేడియం తదితర ప్రాంతాల్లో స్థానిక పోలీసు అధికారులు, భద్రతా విభాగ సిబ్బందితో కలిసి ఎస్పీ భద్రతా ఏర్పాట్లను పరిశీలించారు. 23న హిల్‌వ్యూ స్టేడియంలో బాబా శతజయంతి వేడుకలకు భద్రతా ఏర్పాట్లపై సమీక్షించారు. కార్యక్రమంలో డీఎస్పీ విజయ్‌కుమార్, ఏఆర్‌డీఎస్పీ శ్రీనివాసులు, ప్రశాంతి నిలయం సెక్యూరిటీ వింగ్ సీఐ బాలసుబ్రహ్మణ్యంరెడ్డి, అర్బన్ సీఐ సీతాంజనేయులు, సెక్యూరిటీ వింగ్ ఎస్ఐ ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

# భజనలుంటే.. విభజనలుండవు: రత్నాకర్


జ్యోతి ప్రజ్వలన చేస్తున్న ఆర్‌జే రత్నాకర్ తదితరులు

గోరంట్ల, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): పల్లెలు, పట్టణాల్లో ప్రజలు భజనలు చేస్తే.. విభజనలు లేకుండా కలిసి ఉంటారని శ్రీసత్యసాయి సెంట్రల్ ట్రస్టు మేనేజింగ్ ట్రస్టీ ఆర్‌జే రత్నాకర్ పేర్కొన్నారు. ప్రస్తుతం ప్రజల మధ్య వర్గవైషమ్యాలు పెరుగుతున్నాయనీ, అందరూ కలిసి భక్తితో భజనలు చేయడం ద్వారా అవన్నీ తొలగిపోయి, స్నేహబంధం బలపడుతుందన్నారు. గోరంట్లలో భజన మండలి ఆధ్వర్యంలో నూతనంగా నిర్మించిన శ్రీసత్యసాయి సేవాసదన్ భవనాన్ని ఆయన బుధవారం ప్రారంభించారు. ప్రభుత్వ స్థలంలో ప్రజల విరాళాలతో భక్తులు రెండంతస్తుల భవనం భజన మండలి కోసం సుందరంగా నిర్మించారు. జ్యోతి వెలిగించి ఆర్‌జే రత్నాకర్ భవనాన్ని ప్రారంభించారు. శిలాఫలకాన్ని ఆవిష్కరించి, పూజల్లో పాల్గొన్నారు. బాలవికాస్ పిల్లలు వేదాలను పఠించారు. అనంతరం 108 మందికి వస్త్రదానం చేశారు. ఆర్‌జే రత్నాకర్ మాట్లాడుతూ.. సత్యసాయి బాబా గోరంట్ల మీదుగా బెంగళూరుకు వందలసార్లు వెళ్లారనీ, అలాంటి చోట భజనమండలి భవనం ఏర్పాటు చేయడం సంతోషమన్నారు. అనంతరం మహామంగళహారతి, నారాయణసేవ (అన్నదానం) పెద్దఎత్తున నిర్వహించారు. బాబా చిత్రపటాన్ని పూల పల్లకిపై ఏర్పాటు చేసి, పట్టణ వీధుల్లో ఊరేగించారు. కార్యక్రమంలో సత్యసాయి సేవాసంస్థల రాష్ట్ర అధ్యక్షుడు లక్ష్మణరావు, జిల్లా అధ్యక్షుడు సత్యనారాయణ మూర్తి, మహిళా సేవాదళ్ జిల్లా కోఆర్డినేటర్ విజయలక్ష్మి, భక్తులు సుబ్బరాయుడు, రత్నయ్య, టీడీపీ నాయకులు సోముశేఖర్, నిమ్మల విద్యాధరణి పాల్గొన్నారు.



శివాలయంలో జ్వాలాతోరణాన్ని వెలిగిస్తున్న భక్తులు

కదిరి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి సందర్భంగా బుధవారం స్థానిక శివాలయంలో జ్వాలా తోరణం వెలిగించారు. అధిక సంఖ్యలో భక్తులు తరలివచ్చి ప్రత్యేక పూజలు చేశారు. లక్ష్మీనరసింహ స్వామి, ద్వారం ఆంజనేయస్వామి ఆలయాల్లో జ్వాలా తోరణం వెలిగించారు. అనంతరం లక్ష్మీనరసింహ స్వామి, అమ్మవార్లకు ఉయ్యాలోత్సవం నిర్వహించారు.

# చిలమత్తూరులో ఏసీబీ

● సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు
● కొంత నగదు స్వాధీనం.. రికార్డుల పరిశీలన


విలేకరులతో మాట్లాడుతున్న ఏసీబీ ఇన్‌స్పెక్టర్ జయమ్మ

వివరాలు 7వ పేజీలో





హెచ్చెల్సీలో స్నానం చేసి, కార్తీక దీపాలు వదులుతున్న భక్తులు



తపోవనం చిన్మయ జగదీశ్వరాలయంలో శివపార్వతుల కళ్యాణోత్సవం



ప్రత్యేక అలంకరణలో జగదీశ్వరస్వామి



మొదటిరోడ్డులో విశేషాలంకరణలో కాశీవిశ్వేశ్వర స్వామి

# ఈశా.. కైలాసవాసా..!

## ● కార్తీకం.. భక్తి పారవశ్యం ● ఆలయాల్లో దీప కాంతులు

శివాలయాలలో కార్తీక పున్నమి దీప కాంతులు పరుచుకున్నాయి. దీపాలను వెలిగించేందుకు వచ్చిన భక్తులతో జిల్లా వ్యాప్తంగా ఆలయాలు బుధవారం వేకువజామున, రాత్రి కిక్కిరిసిపోయాయి. అనంతపురం నగరంలోని తుంగభద్ర ఎగువ కాలువలో భక్తులు పుణ్య స్నానాలను ఆచరించారు. దీపాలను వెలగించి, కైలాసవాసుడికి సమర్పించారు. మొదటి రోడ్డులోని కాశీవిశ్వేశ్వర కోదండ రామాలయంలో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. ఆలయ ఆవరణలో ఏర్పాటు చేసిన మంచులింగాన్ని భక్తులు దర్శించుకున్నారు. స్వామివారికి రాత్రి దశహారతులు సమర్పించారు.

- ఆంధ్రజ్యోతి, అనంతపురం టౌన్



మొదటిరోడ్డు కాశీవిశ్వేశ్వరాలయంలో మంచులింగ దర్శనం



హెచ్చెల్సీలో దీపాలు వదులుతున్న భక్తులు



మొదటి రోడ్డు శివాలయంలో జ్వాలా తోరణం, దీపాలు వెలిగిస్తున్న భక్తులు





కోటి వత్తుల దీపం వెలిగిస్తున్న భక్తురాలు →

దీపాల అలంకరణలో శివకోటి ఆలయం ←



## కసాపురంలో జ్వాలాతోరణం

గుంతకల్లు(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం రాత్రి కసాపురంలోని శ్రీ నెట్టికంటి ఆంజనేయస్వామి ఆలయంలో స్వామివార్లకు జ్వాలాతోరణ ఉత్సవాన్ని నిర్వహించారు. శ్రీ సీతారామలక్ష్మణ సహిత ఆంజనేయ స్వామివార్లను పల్లకిలో ఆశీనులనుచేసి ఆలయ ఆవరణలో ఏర్పాటుచేసిన జ్వాలా తోరణం గుండా తీసుకెళ్లారు. ఆలయం బయట ప్రాకారోత్సవాన్ని చేపట్టారు. భక్తులు.. స్వామివార్లను దర్శించుకుని మొక్కుకున్నారు. కార్యక్రమంలో ఆలయ ధర్మకర్త సుగుణమ్మ, ఆలయ అధికారులు, వేద పండితులు, అర్చకులు, గ్రామస్థులు, భక్తులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.



కసాపురం ఆలయంలో జ్వాలా తోరణం గుండా వస్తున్న స్వామివారు

## రేపు కార్తీక వన సమారాధన: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా కేంద్రం సమీపంలోని అమకొండపాల్యం రిజర్వు ఫారెస్టులో గల నగరవనంలో జిల్లా స్థాయి కార్తీక వన సమారాధన నిర్వహించనున్నట్లు కలెక్టర్ శ్యాంప్రసాద్ బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. అడవుల సంరక్షణ, మొక్కల పెంపకం, వాతావరణ మార్పులు, దుష్ప్రభావాల నివారణ గురించి ప్రజలకు అవగాహన కల్పించడానికి కార్తీక వన సమారాధన నిర్వహించాలని రాష్ట్ర ప్రభుత్వం సూచించిందని కలెక్టర్ తెలిపారు. అందులో భాగంగా గురువారం నుంచి వనం మనం-స్వచ్ఛ ఆంధ్ర థీమ్‌పై జిల్లా వ్యాప్తంగా ఇంటర్ కళాశాలల్లో విద్యార్థులకు వ్యాస రచన, వక్తృత్వ, క్విజ్, చిత్రలేఖన పోటీలు నిర్వహిస్తారని తెలిపారు. ఇందులో విజేతలకు 7న వన సమారాధన, జిల్లా స్థాయి కార్యక్రమంలో బహుమతులు అందజేస్తారని చెప్పారు. అలాగే నగరవనంలో ఆటల పోటీలు కూడా నిర్వహిస్తున్నట్లు కలెక్టర్ తెలిపారు. కార్యక్రమంలో ప్రజాప్రతినిధులు, విద్యార్థులు, ప్రభుత్వ ఉద్యోగులు, స్వయం సహాయక సంఘాలు, స్వచ్ఛంద సంస్థలు పాల్గొనాలని కోరారు.

## బాల బాలికల కబడ్డీ జట్ల ఎంపిక



ఎంపికైన ఎస్‌జీఎఫ్ జిల్లా కబడ్డీ జట్టు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): ఎస్‌జీఎఫ్ జిల్లా బాల బాలికల కబడ్డీ జట్లను బుధవారం ఎంపిక చేశారు. స్థానిక ఆర్డీటీ స్టేడియంలో ఎస్‌జీఎఫ్-14 బాల, బాలికల జట్ల ఎంపిక పోటీలు నిర్వహించారు. ఎంపికైన జిలా జట్ల వివరాలను ఎస్‌జీఎఫ్ ఇరు జిల్లాల కార్యదర్శులు శ్రీనివాస్, లక్ష్మీనారాయణలు వెల్లడించారు.

- అండర్-14 బాలికల జట్టులో ఐషా, భాను, అక్షిత, వైష్ణవి, అనుశ్రీ, షర్మిల, రితి, రుక్సానా, సంజన, కౌసల్య, ఉదయశ్రీ, శాంతి, స్టాండ్‌బైలుగా భవ్య, హర్షిత ఎంపికయ్యారు.
- బాలుర జట్టులో అరవింద్, మనోజ్, గౌతమ్, అశోక్, రామ్‌చరణ్, సందీప్, వన్నూర్‌స్వామి, ప్రదీప్, ఇదయ్‌వల్లీ, కళ్యాణ్‌రామ్, అభిలాష్, అయాన్, స్టాండ్‌బైలుగా సమరసింహ, శ్రీకాంత్, నాని, లక్ష్మీనారాయణ ఎంపికయ్యారు.
- అండర్-17 బాలుర జట్టులో చైతన్య, ప్రదీప్, తేజ, వినయ్, మహ్మద్‌వలీ, ఉమర్, పెద్దబాబు, భరత్‌కుమార్, యశ్వంత్, అభి, గౌతమ్, హర్షవర్ధన్, అరవింద్ ఎంపిక కాగా స్టాండ్‌బైలుగా డేవిడ్, రాఘవ, హర్షవర్ధన్, లోకేష్ ఎంపికయ్యారు.
- బాలికల జట్టులో అజయ్‌తేజ, అవనిక, నందుప్రియ, హిమబిందు, మానస, స్వాతి, రామతులసి, నందు, రక్షిత, శిరీష, చాందిని, కీర్తి ఎంపిక కాగా స్టాండ్‌బైలుగా బి. నవ్యశ్రీ, షబానా, సాజియా, వి. నవ్యశ్రీ ఎంపికయ్యారు. ఎంపికైన జట్లు ఈనెలాఖరులో జరిగే రాష్ట్ర స్థాయి ఎస్‌జీఎఫ్ కబడ్డీ పోటీల్లో పాల్గొంటారని తెలిపారు.

## పంచాయతీ కార్యదర్శిపై సస్పెన్షన్ వేటు

అనంతపురం న్యూటౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి) విధుల్లో నిర్లక్ష్యం వహించిన కణేకల్లు మండలం హులికేర పంచాయతీ కార్యదర్శి తిమ్మప్పపై సస్పెన్షన్ వేటు వేసినట్లు డీపీఓ నాగరాజనాయుడు తెలిపారు. స్వర్ణ పంచాయతీ పోర్టల్‌లో నిబంధనలకు విరుద్ధంగా ఇంటి పన్ను వివరాలు ఒకే ఇంటి యజమాని ఫోన్ నంబర్ నుంచి 300 మందికి నమోదు చేశారు. ఇలాంటి తప్పిదాలపై ప్రతి జిల్లా నుంచి ఒకరిపై చర్యలు చేపట్టాలని కమిషనర్ కార్యాలయం నుంచి ఆదేశాలు వచ్చాయి. దీంతో జిల్లాలో అత్యధికంగా ఒకే ఫోన్‌నంబర్ నమోదు చేసిన హులికేర పంచాయతీ కార్యదర్శి అయిన తిమ్మప్పపై చర్యలు తీసుకోవాలంటూ కలెక్టర్‌కు ఫైల్ పెట్టారు. ఆయన సస్పెన్షన్ ఉత్తర్వులు జారీ చేశారని డీపీఓ తెలిపారు.

## పనులు వేగంగా చేయండి: పీఆర్ ఎస్ఈ

అనంతపురం న్యూటౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): శ్రీ సత్యసాయి జిల్లాలో పీఆర్ ప్రాజెక్ట్ అమలు యూనిట్ ద్వారా చేపడుతున్న అభివృద్ధి పనులు వేగంగా పూర్తి చేయాలని ఇంజనీర్లను ఎస్ఈ చిన్న సుబ్బరాయుడు ఆదేశించారు. ఈఈ శంకరయ్యతో కలిసి బుధవారం ఆయన శ్రీ సత్యసాయి జిల్లా పీఐయూ డీఈలు, ఏఈలతో సమావేశం నిర్వహించారు. ఈ సమావేశం ఎస్ఈ సర్కిల్ కార్యాలయంలో చేపట్టారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు వారిగా సంబంధిత అధికారులతో క్షుణంగా సమీక్షించారు. ప్రస్తుతం చేపడుతున్న పనులు పూర్తి చేసినట్లు అయితే తిరిగి కొత్త పనులకు అనుగుణంగా అనుమతులు పొందే అవకాశం ఉంటుందన్నారు.

## రాష్ట్రస్థాయి పోటీలకు హర్షిత్

రామగిరి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని నసనకోట ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన విద్యార్థి సాకే హర్షిత్ అనంతపురం నగరంలో గల ఆర్డీటీ క్రీడామైదానంలో గత అక్టోబరు 28వ తేదీన జరిగిన అండర్-14 కురుష్ పోటీల్లో ప్రతిభ చూపి రాష్ట్రస్థాయికి ఎంపికైనట్లు పాఠశాల హెచ్‌ఎం కల్యాణి, పీడీ నాగార్జున తెలిపారు. దీంతో పాఠశాలలో బుధవారం ఆ విద్యార్థిని వారితోపాటు ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయిలో కూడా రాణించాలని ఆకాంక్షించారు.

## సీఎంఆర్ఎఫ్ చెక్కుల పంపిణీ



చెక్కులను అందజేస్తున్న ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ

శింగనమల, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలోని 28 మందికి రూ.31,49,207 మేర సీఎం రిలీఫ్ ఫండ్ మంజూరైంది. అందుకు సంబంధించిన చెక్కులను ఎమ్మెల్యే బండారు శ్రావణిశ్రీ జిల్లాకేంద్రంలోని తన క్యాంపు కార్యాలయంలో బుధవారం లబ్ధిదారులకు అందజేశారు.

## కనకదుర్గమ్మ సేవలో ఎమ్మెల్యే దగ్గుపాటి



ఎమ్మెల్యేకు ప్రసాదం అందజేస్తున్న అర్చకులు

అనంతపురం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని అనంతపురం అర్బన్ ఎమ్మెల్యే దగ్గుబాటి వెంకటేశ్వర ప్రసాద్ బుధవారం విజయవాడ కనకదుర్గమ్మను దర్శించుకున్నారు. ఎమ్మెల్యే తన సన్నిహితుల తో కలిసి వెళ్లగా ఆలయ అధికారులు, అర్చకులు ఘన స్వాగతం పలికారు. అనంతరం కనకదుర్గమ్మ అమ్మవారితో పాటు దుర్గా మల్లేశ్వరస్వామి దర్శ నం చేయించి ప్రత్యేక పూజలు జరిపించారు. తర్వాత వే ద ఆశీర్వచనాలు, తీర్థప్రసాదాలు అందజేశారు.

## టెన్త్‌లో మంచి మార్కులతో ఉత్తీర్ణులవ్వాలి

చెన్నేకొత్తపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది జరిగే 10వ తరగతి పరీక్షలలో విద్యార్థులంతా మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని ప్రభుత్వ ఎగ్జామినేషన్ జిల్లా అసిస్టెంట్ కమిషనర్ లాజర్ సూచించారు. మండలకేంద్రంలోని మోడల్ స్కూల్‌లో బుధవారం ఆయన విద్యార్థులతో సమావేశం నిర్వహించి మాట్లాడారు. పది పరీక్షలలో మండలంలో టాపర్‌లుగా నిలిచిన వారికి ప్రభుత్వం ప్రోత్సాహకాలు అందిస్తుందన్నారు. కావున విద్యార్థులు బాగా చదువుకుని మంచి ఫలితాలు సాధించాలన్నారు. అనంతరం 2026 పది పరీక్షల ఏర్పాట్లలో భాగంగా కేంద్రాల ఎంపిక కోసం పలు పాఠశాలలను పరిశీలించారు. ఆయన వెంట మోడల్‌స్కూల్ ప్రిన్సిపాల్ స్వర్ణలత, ఎంఈఓ ప్రసూన్‌కుమార్‌నాయుడు ఉన్నారు.

## భక్త కనకదాస జయంతికి తరలిరండి

అనంతపురం ప్రెస్‌క్లబ్, నవంబరు5(ఆంధ్రజ్యోతి) : కురుబల ఆరాధ్యుడైన భక్తకనకదాస జయంతి ఈనెల 8వ తేదీన జరగనుందని, విజయవంతం చేయాలని కురుబ సంఘం జిల్లా అధ్యక్షుడు తుప్పటి ఈశ్వరయ్య పిలుపునిచ్చారు. నగరంలోని సంఘం కార్యాలయంలో బుధవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడారు. జయంతి వేడుకలలో భాగంగా స్థానిక పాతూరులోని భక్తకనకదాస విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించనున్నట్లు చెప్పారు. అనంతరం కళ్యాణదుర్గంలో రాష్ట్రస్థాయి వేడుకలను నిర్వహించనున్నట్లు తెలిపారు. జిల్లాలోని కురబలు పెద్దఎత్తున తరలిరావాలని కోరారు. జిల్లా ప్రధాన కార్యదర్శి ఆవుల కృష్ణయ్య, రాష్ట్ర నాయకులు గంజే నాగరాజు, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ బాల నాగేంద్ర, జిల్లా నాయకులు విఠల్‌గౌడ్, బండి పరశురాం పాల్గొన్నారు.

## డెమోక్రటిక్ అభ్యర్థి ఎన్నిక ప్రజావిజయం: సీపీఎం

అనంతపురం టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): సామ్రాజ్య అమెరికా దేశంలో న్యూయార్క్ మేయర్‌గా డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి జోహ్రాన్ మమ్దానీ ఎన్నిక ప్రజా విజయమని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు వెంకటేశ్వరరావు, రాంభూపాల్ పేర్కొన్నారు. స్థానిక గణేనాయక్ భవన్‌లో బుధవారం నిర్వహించిన సీపీఎం జిల్లా కమిటీ సమావేశానికి వారు ముఖ్యఅతిథులుగా హాజరై మాట్లాడారు. ఇటీవల అమెరికా న్యూయార్క్ మేయర్‌గా డెమోక్రటిక్ పార్టీ అభ్యర్థి జోహ్రాన్ మమ్దానీ గెలిచారని, ఇది బడా కార్పొరేట్లపై న్యూయార్క్ ప్రజలు సాధించిన విజయమని పేర్కొన్నారు. అమెరికా గడ్డమీద ఒక సోషలిస్టు భావాలు కలిగిన వ్యక్తి విజయం సాధించడం చారిత్రాత్మకమన్నారు. కార్యక్రమంలో సీపీఎం జిల్లా కార్యదర్శి నల్లప్ప, జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు శ్రీనివాసులు, బాలరంగయ్య, నాగేంద్రకుమార్, సావిత్రి, చంద్రశేఖర్‌రెడ్డి, రామిరెడ్డి, కృష్ణమూర్తి, జిల్లా కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## నిధులు మంజూరు చేయాలని వినతి

అనంతపురం టౌన్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్ర ప్రభుత్వం విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్‌కు కనీసం రూ.200 కోట్ల నిధులు మంజూరు చేసి విశ్వబ్రాహ్మణ చేతివృత్తులను ప్రోత్సహించాలని విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్ కుర్లపల్లి రంగాచారి కోరారు. ఈమేరకు విజయవాడలో బుధవారం రాష్ట్ర బీసీ సంక్షేమశాఖ మంత్రి సవితను కలిసి వినతిపత్రం అందజేశారు.

## జువాలజీ విద్యార్థులకు అపార అవకాశాలు

అనంతపురంరూరల్,నవంబరు5(ఆంధ్రజ్యోతి): జువాలజీ విద్యార్థులకు అపారమైన అవకాశాలున్నాయని, సబ్జెక్టుపై పట్టు సాధిస్తే అవకాశాలను అందిపుచ్చుకోవచ్చునని ఆ విభాగాధిపతి ప్రొఫెసర్ మురళీధర్ సూచించారు. శ్రీకృష్ణదేవరాయ విశ్వవిద్యాలయంలోని జువాలజీ విభాగంలో బుధవారం ఫ్రెషర్స్ డేను ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆయన హాజరై మాట్లాడారు. జువాలజీ విద్యార్థులకు అవకాశాలు పుష్కలంగా ఉన్నాయన్నారు. వాటిని సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు. టీచింగ్ అసిస్టెంట్ బాలసుబ్రమణ్యం, జూనియర్ అసిస్టెంట్ పెద్దన్న, ఉద్యోగులు, విద్యార్థులు పాల్గొన్నారు.

## కాజేసిన సొమ్మును రికవరీ చేయండి

చెన్నేకొత్తపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బ్యాంకులో తీసుకున్న రుణాలకు సంబంధించి తాము చెల్లించిన సొమ్ము రూ.30లక్షలకు పైగా కాజేసిన బ్యాంకు బిజినెస్ కరస్పాండెంట్ కృష్ణారెడ్డి నుంచి తమ సొమ్ము రికవరీ చేయాలంటూ మండలంలోని ప్రసన్నాయపేటకు చెందిన డ్వాక్రామహిళలు డిమాండ్ చేశారు. ఈ మేరకు మండలంలోని కనుముక్కల ఆంధ్రప్రదేశ్ గ్రామీణ బ్యాంకు ఎదుట బుధవారం వారు కొద్దిసేపు ఆందోళన చేపట్టారు. అనంతరం బ్యాంకు అధికారులకు వినతిపత్రం సమర్పించారు.

## ఇస్లామియా పద్ధతిలో నిఖా చేయాలి

గుంతకల్లుటౌన్, నవంబరు5(ఆంధ్రజ్యోతి): ఇస్లామియా పద్ధతిలో నిఖా చేయాలని గుంతకల్లు ప్రభుత్వ ఖాజీ అబ్దుల్ రజాక్ పీర్ సాబ్ పేర్కొన్నారు. స్థానిక ఖాజీ కార్యాలయంలో బుధవారం ఉమ్మడి జిల్లాకు చెందిన ప్రభుత్వ ఖాజీల సమావేశం నిర్వహించారు. అబ్దుల్ రజాక్ పీర్ సాబ్ మాట్లాడుతూ.. పెద్దలు చెప్పినట్లుగా నిఖా పవిత్రంగా జరగాలన్నారు. ఆచారాలు పాటించాలే తప్ప.. ప్రదర్శనలు చేయరాదన్నారు. ప్రభుత్వ ఖాజీలు అబ్దుల్ సత్తార్ సాబ్, గులాం రసూల్ సాబ్, సైఫుల్లా సిరాజీ సాబ్,అబ్దుల్ హై సాబ్, ముల్లా మహమ్మద్ బైద్సాబ్, చాంద్‌బాషా సాబ్, అబ్దుల్ అజామ్ సాబ్, నాసిర్ బాషాసాబ్, ఫజ్లూర్ రెహెమాన్ సాహెబ్, అబ్దుల్‌మాలిక్ సాబ్, ఖయ్యూమ్‌సాబ్ పాల్గొన్నారు.

## వనభోజనాల్లో స్పెషల్ కోర్టు న్యాయాధికారి



వనభోజనాల్లో పాల్గొన్న న్యాయాధికారిని సన్మానిస్తున్న సభ్యులు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీకపౌర్ణమి సందర్భంగా నగరంలోని చాకలి ఐలమ్మ కాలనీలో గల గంగమ్మ ఆలయంలో స్థానికులు ప్రత్యేక పూజలను ఘనంగా నిర్వహించారు. అనంతరం అక్కడే వనభోజనాలు ఏర్పాటు చేశారు. ఇందులో ప్రత్యేక కోర్టు న్యాయాధికారి శివశంకర్, రజకవృత్తిదారుల సమాఖ్య రాష్ట్ర ప్రధాన కార్యదర్శి లింగమయ్య తదితరులు పాల్గొన్నారు.

## స్వాహా సొమ్ము జమ చేయండి

యల్లనూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని మల్లాగుండ్ల గ్రామంలో లక్ష్మీనరసింహ మహిళా పొదుపు సంఘం సభ్యులు చెల్లించిన రుణ కంతుల సొమ్మును అదే గ్రామానికి చెందిన యానిమేటర్ బ్యాంక్‌లో జమ చేయకుండా స్వాహా చేశారు. దీన్ని గుర్తించిన సభ్యులు గత నెల 30న స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. కాగా, సంఘంలోని కొంతమంది సభ్యులు కూడా బ్యాంకులో డబ్బులు చెల్లించకుండా వాడుకున్నట్లు అధికారులు తేల్చారు. దీంతో ఎస్ఐ రామాంజనేయరెడ్డి ఆ సభ్యులు, లీడర్లను యానిమేటర్‌ను బుధవారం పోలీస్‌స్టేషన్‌కు పిలిపించి విచారించారు. డబ్బులను వెంటనే బ్యాంక్‌లో జమ చేయాలని ఆదేశించారు.

## వీఆర్వోల డ్యూటీ ఉత్తర్వులు రద్దు చేయండి

### ● కలెక్టర్లకు వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడి లేఖ

అనంతపురం కలెక్టరేట్, నవంబరు5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో నిర్వహించనున్న రెవెన్యూ క్రీడాపోటీలకు సంబంధించి ఏర్పాట్లు చూడాలంటూ గ్రామ రెవెన్యూ అధికారు(వీఆర్వో)లకు ఇచ్చిన ఉత్తర్వులను రద్దు చేయాలని ఉమ్మడి జిల్లా కలెక్టర్లకు వీఆర్వోల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు రవీంద్రరాజు కోరారు. ఈ మేరకు ఆయన బుధవారం ఉమ్మడి జిల్లా కలెక్టర్లకు లేఖ రాశారు. వీఆర్వోలు.. రెవెన్యూ సర్వీస్ అసోసియేషన్‌లో సభ్యులు కారన్నారు. రెవెన్యూ స్పోర్ట్స్ పేరుతో ప్రభుత్వాన్ని తప్పుదోవ పట్టించి రూ.80లక్షలు మంజూరు చేయించుకున్నారన్నారు. వీఆర్వోలకు రెవెన్యూ క్రీడాపోటీల్లో పాల్గొనే అవకాశం ఇవ్వలేదన్నారు. ఈ నేపథ్యంలో వీఆర్వోలకు ఏర్పాట్ల బాధ్యతలు అప్పగించడం సరికాదన్నారు. బలవంతంగా డ్యూటీలు వేయవద్దని కోరారు.

## పశుపతినాథుడిని దర్శించుకున్న న్యాయాధికారి



పశుపతినాథునికి పూజలు చేస్తున్న జిల్లా న్యాయాధికారి

రాయదుర్గంరూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని చదంగొల్లలదొడ్డి గ్రామ సమీపాన లింగాలబండపై వెలసిన పశుపతినాథుడి ఆలయాన్ని ఎస్సీ, ఎస్టీ జిల్లా అదనపు న్యాయాధికారి సాదుబాబు బుధవారం సందర్శించారు. కుటుంబసమేతంగా.. స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ చరిత్రను అడిగి తెలుసుకున్నారు. న్యాయాధికారిని ఆలయ కమిటీ సభ్యులు శాలువా, పూలమాలలతో సత్కరించారు. తరువాత డి హిరేహాళ్ మండలంలోని మురడి ఆంజనేయస్వామి దేవాలయాన్ని సందర్శించి, స్వామివారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.

## సంగమేశ్వరుడి సన్నిధిలో హైకోర్టు మాజీ జడ్జి



స్వామివారిని దర్శించుకుంటున్న హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ శ్యాంసుందర్

కూడేరు, నవంబరు 5, (ఆంధ్రజ్యోతి): ప్రసిద్ధి చెందిన జోడులింగాల సంగమేశ్వర స్వామిని హైకోర్టు రిటైర్డ్ జడ్జి జస్టిస్ బండారు శ్యాం సుందర్ బుధవారం దర్శించుకున్నారు. ఆలయ అర్చకులు, అభివృద్ధి కమిటీ సభ్యులు ఆయనకు ఘనంగా స్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఆయన స్వామివారికి వివిధ రకాల అభిషేకాలు, పూజలు నిర్వహించారు. కాగా ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు వైభవంగా జరిగాయి. మండలంలోని వివిధ ప్రాంతాల నుంచి తరలివచ్చిన భక్తులు పార్వతీపరమేశ్వరులను దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు.

## 12 నుంచి ఉద్యోగులకు క్రీడాపోటీలు

కొత్తచెరువు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలోని అన్ని ప్రభుత్వ శాఖల సివిల్‌సర్వీసు మహిళలు, పురుష ఉద్యోగులకు ఈనెల 12 నుంచి క్రీడాపోటీలు నిర్వహిస్తామని జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉదయ్‌భాస్కర్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మొత్తం 19 క్రీడాంశాలలో పోటీలు ఉంటాయన్నారు. జిల్లాస్థాయి క్రీడాపోటీలు కేవీకే పెనుకొండ, ధర్మవరం కళాజ్యోతిలో, ప్రభుత్వ పాఠశాలలో నిర్వహిస్తామని తెలిపారు. 12న బ్యాడ్మింటన్ పోటీలు కేవీకే పెనుకొండలో జరుగుతాయన్నారు. బాస్కెట్‌బాల్, క్రికెట్, ఫుట్‌బాల్, కబడ్డీ, ఖోఖో, అథ్లెటిక్స్, హాకీ, వాలీబాల్‌పోటీలు ధర్మవరం ప్రభుత్వ బాలుర ఉన్నతపాఠశాల క్రీడామైదానంలో జరుగుతాయన్నారు. స్విమ్మింగ్, టేబుల్ టెన్నిస్, రెజ్లింగ్, వెయిట్ లిఫ్టింగ్, పవర్‌లిఫ్టింగ్, క్యారమ్స్, చెస్, లాన్‌టెన్నిస్, యోగా, నృత్యం, సంగీతం, షాట్‌ప్లే క్రీడలు ధర్మవరం కళాజ్యోతిలో జరుగుతాయని తెలిపారు. జిల్లా స్థాయిలో విజయం సాధించిన క్రీడాకారులు ఈనెల 19 నుంచి 22 వరకు విజయవాడలో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు జిల్లా క్రీడాభివృద్ధి అధికారి ఉదయ్‌భాస్కర్ 9849421462 నంబరును సంప్రదించాలన్నారు.

## అనంతలో 13 నుంచి..

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రభుత్వ ఉద్యోగులకు ఈనెల 13వ తేదీన అనంతపురంలో జిల్లాస్థాయి క్రీడాపోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా క్రీడా అభివృద్ధి అధికారి (డీఎస్‌డీఓ) మంజుల బుధవారం ప్రకటనలో తెలిపారు. అథ్లెటిక్స్, వాలీబాల్, వెయిట్ లిఫ్టింగ్, పవర్ లిఫ్టింగ్, ఖో-ఖో, క్రికెట్ పోటీలు నీలం సంజీవరెడ్డి పీటీసీ మైదానంలో ఉదయం 8గంటలకు నిర్వహిస్తామన్నారు. ఫుట్‌బాల్, హాకీ, లాన్‌టెన్నిస్ పోటీలు ఆర్ట్స్ కాలేజీ మైదానంలో ఉంటాయన్నారు. రెజ్లింగ్, బ్యాడ్మింటన్, బాస్కెట్‌బాల్, క్యారమ్స్, చెస్, కబడ్డీ, టేబుల్‌టెన్నిస్, యోగా, బెస్ట్ ఫిజిక్, డ్యాన్స్, మ్యూజిక్ పోటీలు అశోక్‌నగర్‌లోని డీఎస్ఏ ఇండోర్ స్టేడియంలో నిర్వహిస్తామన్నారు. ప్రసన్నాయపల్లి రైల్వేస్టేషన్ సమీపంలోని స్విమ్మింగ్‌పూల్‌లో ఈత పోటీలు ఉంటాయన్నారు. ఎంపికైన ఉద్యోగులు ఈనెల 19వవతేదీ నుంచి ఎన్టీఆర్, గుంటూరు జిల్లాల్లో నిర్వహించే రాష్ట్రస్థాయి పోటీల్లో పాల్గొంటారన్నారు. వివరాలకు 08554-315632 నంబరులో సంప్రదించాలని కోరారు.

## 10 నుంచి ఎస్‌ఏ-1 పరీక్షలు

### డీసీఈబీ కార్యదర్శి గంధం శ్రీనివాసులు



అనంతపురం విద్య, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రస్తుత విద్యాసంవత్సరానికి సంబంధించి ఎస్‌ఏ-1 పరీక్షలు ఈనెల 10వతేదీ నుంచి నిర్వహించనున్నట్లు డీసీఈబీ కార్యదర్శి గంధం శ్రీనివాసులు తెలిపారు. ఆ వివరాలను ఆయన బుధవారం వెల్లడించారు. 6 నుంచి 10వ తరగతి వరకు ఈనెల 10 నుంచి 19వ తేదీ వరకు పరీక్షలు కొనసాగుతాయన్నారు. ఈనెల 11 నుంచి 15వ తేదీ వరకు 1 నుంచి 5వ తరగతుల వరకు పరీక్షలు ఉంటాయన్నారు. ఇప్పటికే ప్రశ్నాపత్రాలు 6నుంచి 10వరకు ఎమ్మార్సీలకు, 1నుంచి 5 తరగతుల వరకు క్లస్టర్ల కాంప్లెక్స్‌లకు సరఫరా చేశామన్నారు. ఈనెల25 నాటికి మూల్యాంకనం పూర్తి చేయాల్సి ఉంటుందన్నారు.

## పుదుచ్చేరి, ఆంధ్రా మ్యాచ్ డ్రా



ఆంధ్రా కెప్టెన్ హేమంత్‌రెడ్డికి మెమెంటో అందజేస్తున్న భీమలింగారెడ్డి

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు5(ఆంధ్రజ్యోతి): పుదుచ్చేరి, ఆంధ్రా అండర్-23 జట్ల మధ్య సీకే నాయుడు క్రికెట్ టోర్నీ మ్యాచ్ డ్రాగా ముగిసింది. స్థానిక అనంతపురం క్రీడామైదానంలోని రాయలసీమ క్రికెట్ గ్రౌండ్‌లో బుధవారం మూడోరోజు పుదుచ్చేరి జట్టు 37-4తో రెండో ఇన్నింగ్స్ కొనసాగించింది. తొలి ఇన్నింగ్స్ సెంచరీ హీరో ఆ జట్టు కెప్టెన్ నియాన్ శ్యామ్ కంగయాన్ మరో సెంచరీ (107)తో ఆకట్టుకున్నాడు. ఆకాష్ హాఫ్ సెంచరీ (51) కొట్టాడు. దీంతో పుదుచ్చేరి జట్టు 76.2 ఓవర్లలో 6వికెట్లు కోల్పోయి 214 పరుగలు చేసింది. చివరిరోజు కావడంతో మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. ఆంధ్రా బౌలర్లు కేఎస్ఎన్ రాజు 4, సుమిత్, ఆదిత్యరెడ్డి చెరో వికెట్ తీశారు. అంతకుముందు పుదుచ్చేరి జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 110.4 ఓవర్లలో 337 పరుగులు చేసింది. ఆంధ్రా జట్టు 341పరుగలకు 9 వికెట్ల వద్ద తొలి ఇన్నింగ్స్‌ను డిక్లేర్ చేసింది. రెండో ఇన్నింగ్స్‌లో పుదుచ్చేరి 214 పరుగులు చేసింది. మ్యాచ్ అనంతరం జిల్లా క్రికెట్ సంఘం అధ్యక్షుడు ప్రకాష్‌రెడ్డి, కార్యదర్శి భీమలింగారెడ్డి.. రెఫరీ, అఫీషియల్స్ ఇరు జట్ల కెప్టెన్లకు మొమెంటోలు అందజేశారు.

## కీచక టీచర్‌పై లోతుగా దర్యాప్తు

అనంతపురం విద్య, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): వజ్రకరూరు మండలం వెంకటంపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించి సస్పెండైన టీచర్‌పై విద్యాశాఖ ఉన్నతాధికారులు మరింత లోతుగా దర్యాప్తు మొదలు పెట్టారు. ఆ టీచర్ ఎక్కడ పనిచేసినా అంతేనని సమాచారం. గతంలో పనిచేసిన ప్రాంతంలో కూడా ఓ మహిళా టీచర్‌తోపాటు విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తిస్తూ వేధించాడని తెలిసింది. అక్కడ హెచ్‌ఎం, ఎంఈఓ, టీచర్లు విషయం కప్పిపెట్టారని జిల్లా విద్యాశాఖ ఉన్నతాధికారులకు సమాచారం అందింది. ఇలాంటి టీచర్‌ను సస్పెండ్ చేస్తే సరిపోదనీ, అంతకన్నా తీవ్రమైన పనిష్మెంట్ ఇవ్వాల్సిందేనన్న అభిప్రాయానికి వచ్చినట్లు తెలిసింది. ఈ నేపథ్యంలో ఆ టీచర్ ఉద్యోగంలో ఎప్పుడు చేరాడు, ఏయే పాఠశాలల్లో పనిచేశాడు, ఈయన సాగించిన కీచక పర్వాల గురించి పూర్తిస్థాయిలో ఆరాతీసి, రాష్ట్ర విద్యాశాఖ అధికారుల దృష్టికి తీసికెళ్లి మరింత కఠిన చర్యలు తీసుకునేలా చూస్తున్నట్లు ఓ అధికారి తెలిపారు. ఈ లెక్కన ఆ కీచక టీచర్ ఉచ్చుబిగిస్తున్నారని తెలుస్తోంది.

## మరింత గడువు ఇవ్వండి

### బడి బస్సుల తనిఖీలపై డీటీసీకి అపుస్మా నేతల వినతి



డీటీసీకి వినతిపత్రం అందజేస్తున్న ప్రైవేటు స్కూళ్ల సంఘం నాయకులు

అనంతపురం విద్య, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): బడి బస్సుల ఫిట్‌నెస్, అర్హత పత్రాల తనిఖీలకు మరింత గడువు ఇవ్వాలని జిల్లా ట్రాన్స్‌పోర్టు అధికారికి ప్రైవేటు స్కూళ్ల అసోసియేషన్ (అపుస్మా) నేతలు విజ్ఞప్తి చేశారు. ఆ సంఘం నేతలు కుసుమా పుల్లారెడ్డి, సుబ్బారెడ్డి, నాయుడు, సూర్యనారాయణరెడ్డి, మధుసూదనరెడ్డి, రవిశంకరప్రసాద్ తదితరులు బుధవారం డీటీసీని కలిశారు. వారు మాట్లాడుతూ.. ఈనెల 10వ తేదీలోగా బడిబస్సులన్నింటినీ తనిఖీ చేయాలనీ, నిబంధనలకు విరుద్ధంగా ఉంటే చర్యలు తీసుకోవాలని ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసిందన్నారు. రవాణాశాఖ మంత్రిని కలిసి తనిఖీలకు మరింత గడువు ఇవ్వాలని కోరామనీ, అందుకు ఆయన సానుకూలంగా ఉన్నారన్నారు. ఈ నేపథ్యంలో మరింత గడువు ఇవ్వాలని కోరుతూ వినతిపత్రం అందజేశారు.

## దరఖాస్తుల ఆహ్వానం

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ యువత, కిశోరబాలికల అభివృద్ధి కార్యక్రమం కింద కేంద్ర ఆర్థికసాయం పొందడానికి స్వచ్ఛంద సంస్థ (ఎన్జీఓ)లు ఈనెల 30వతేదీలోపు ఆన్‌లైన్‌లో దరఖాస్తు చేసుకోవాలని జిల్లా యువజన సంక్షేమశాఖ అధికారి రవిశంకర్‌రెడ్డి బుధవారం ప్రకటనలో తెలిపారు. రిజిస్ట్రేషన్ ఐడీ ఉన్న స్వచ్ఛంద సంస్థలు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. వివరాలకు 9849909062 నంబరులో సంప్రదించాలని కోరారు. https://youth. yas.gov.in. /scheme/npyad/ngo/login వెబ్‌సైట్‌ను సందర్శించాలన్నారు.

## ట్రైనింగ్ పోర్టల్‌పై అవగాహన అవసరం

అనంతపురం న్యూటౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ పోర్టల్‌పై ప్రతి ఒక్కరికి అవగాహన అవసరమని డీపీఆర్‌సీ ట్రైనింగ్ మేనేజర్ నిర్మల్‌దాస్ సూచించారు. ఉమ్మడి జిల్లాలోని ప్రతి మండలం నుంచి జూనియర్ అసిస్టెంట్, టైపిస్టు, కంప్యూటర్ ఆపరేటర్లకు ట్రైనింగ్ మేనేజ్‌మెంట్ పోర్టల్, ఈ ప్రగతి యాప్‌పై స్థానిక డీపీఆర్‌సీ సమావేశ భవనంలో శిక్షణ ఇచ్చారు. డీపీఆర్‌సీ ట్రైనింగ్ మేనేజర్ నిర్మల్‌దాస్, డీపీఓ కార్యాలయ డీపీఎం అబ్దుల్ శిక్షణ ఇచ్చారు. సమస్యలు తలెత్తకుండా చూడాలని ఆదేశించారు.

## శిక్షణకు జడ్పీ డిప్యూటీ సీఈఓ

అనంతపురం న్యూటౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లా పరిషత్ డిప్యూటీ సీఈఓ వెంకటసుబ్బయ్య.. డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ ఇండక్షన్ శిక్షణకు 15 రోజుల పాటు విజయవాడకు వెళ్లారు. నూతనంగా డీడీఓలుగా ఉద్యోగోన్నతి పొందిన వారికి 30 రోజులపాటు శిక్షణ ఉంటుంది. ఇప్పటికే మొదటి విడతలో డీడీఓ నాగశివలీల అక్టోబరు 5 నుంచి 19వతేదీ వరకు నిర్వహించిన శిక్షణకు హాజరయ్యారు. ఉద్యోగోన్నతి పొంది డిప్యూటీ సీఈఓలు, ఏపీడీలుగా ఉన్న వారికి బుధవారం నుంచి ఈనెల 19వ తేదీ వరకు శిక్షణ ఇవ్వనున్నారు. ఆ మేరకు డిప్యూటీ సీఈఓ శిక్షణకు హాజరుకానున్నారు.

## వేతన బకాయిలు వెంటనే చెల్లించాలి

### పంచాయతీ కార్మికుల ధర్నా

అనంతపురం న్యూటౌన్, నవంబరు5(ఆంధ్రజ్యోతి): వేతన బకాయిలు వెంటనే చెల్లించాలని పంచాయతీ కార్మికులు డిమాండ్ చేశారు. ఈ మేరకు ఏపీ పంచాయతీ కార్మిక సంఘం నాయకులు.. సీఐటీయూ ఆధ్వర్యంలో బుధవారం జిల్లా పంచాయతీ కార్యాలయం (డీపీఓ) ముందు ధర్నా చేపట్టారు. అంతకుముందు రుద్రంపేట సర్కిల్ నుంచి కార్మికులు ర్యాలీగా డీపీఓ కార్యాలయం వరకు చేరుకుని, అక్కడ ధర్నా చేపట్టారు. నాయకులు మాట్లాడుతూ.. సకాలంలో వేతనాలు ఇవ్వకపోవడం దారుణమన్నారు. అనంతపురం రూరల్ పంచాయతీలో కార్మికులకు మూడు నెలలుగా వేతనం అందడం లేదన్నారు. దీంతో కార్మికులు తీవ్ర ఆర్థిక ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే బకాయి వేతనాలు చెల్లించి, ఆదుకోవాలని కోరారు. అనంతరం ఏఓ నాగరాజుకు వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో నాయకులు బాషా, గౌరవాధ్యక్షుడు గోపాల్, ప్రధాన కార్యదర్శి శివప్రసాద్, మున్సిపల్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు నాగభూషణ పాల్గొన్నారు.

# ఎన్నేళ్లీ ఎంజాయ్‌మెంట్..!

### కమ్మర కులస్థుల భూమిలో వైసీపీ నాయకుల పాగా

### బ్రిటిష్ పాలనలో 24.44 ఎకరాలు కేటాయింపు

### డైక్లాట్, ఆర్‌హెచ్‌లలో కమ్మర కులస్థుల పేరు

### అన్నదమ్ముల వివాదంతో వెలుగులోకి..



వైసీపీ నేతలు సాగు చేస్తున్న కమ్మర కులస్థుల ఇనామ్ భూమి

కూడేరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని జల్లిపల్లి గ్రామంలో బ్రిటిష్ పాలనా కాలం నుంచి ఓ భూమికి సంబంధించి పేరు ఒకరిది.. పెత్తనం మాత్రం మరొకరిదిగా సాగుతోంది. తమ పేరుమీద ఉన్న భూమి కోసం వారు ఎంత పోరాటం చేసినా వృథానే అయ్యింది. ఆ భూమిని సాగు చేసుకుంటున్న వారు రాజకీయ పలుకుబడితో అసలు హక్కుదారులను అణచివేస్తున్నారు. తాజాగా ఆ భూమిని సాగు చేస్తున్న అన్నదమ్ముల మధ్య తలెత్తిన వివాదంతో రెవెన్యూ అధికారులు రంగంలోకి దిగి నిజానిజాలు నిగ్గుతేల్చే పనిలో పడ్డారు.

#### విలువైన భూమి కావడంతోనే...

జల్లిపల్లి గ్రామ సమీపంలో కమ్మర కులస్థులకు కేటాయించిన సర్వే నెంబరు 486లోని 24.44 ఎకరాల భూమి ప్రస్తుత ధరల మేరకు రూ. కోట్లు విలువ చేస్తోంది. ఆ భూమి అనంతపురం-బళ్లారి ప్రధాన రహదారికి పక్కనే ఉంది. ప్రస్తుతమున్న మార్కెట్ విలువ ప్రకారం ఆ ప్రాంతంలో ఎకరా రూ. 50 లక్షలపైమాటే నడుస్తోంది. ఆ క్రమంలోనే వైసీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి సాగు చేస్తున్న పొలం విషయంలో అన్నదమ్ముల మధ్య వివాదం రాజుకుంది. భూమి వాటాల్లో తేడాలు రావడంతో వివాదం రెవెన్యూ అధికారుల చెంతకు చేరింది. ఆ సమయంలో సర్వే నెంబర్లు, డైక్లాట్, ఆర్‌హెచ్‌ను అధికారులు పరిశీలించారు. దీంతో అసలు విషయం బయటికి వచ్చింది. ఆ భూమి బ్రిటిష్ కాలంలోనే కమ్మర కులస్థులకు కేటాయించారని, మీరెందుకు సాగులో ఉన్నారని... మీకేమైనా కమ్మర కులస్థులు అమ్మారా..? కొనుగోలు చేసి ఉంటే వాటికి సంబంధించి డాక్యుమెంట్లు ఇవ్వాలని అధికారులు కోరారు. పలుమార్లు అధికారులు ఆరాతీసినా... రామచంద్రారెడ్డి, కుటుంబసభ్యులు, ఆ భూమిలో సాగులో ఉన్న మరికొంత మంది నుంచి ఎటువంటి రికార్డులు అధికారులకు ఇవ్వలేదని సమాచారం.

#### బ్రిటిష్ కాలంలోనే కేటాయింపు

బ్రిటిష్ వారి పాలనలో జల్లిపల్లి గ్రామంలో కమ్మర కులస్థులకు సర్వే నెంబర్ 486లో 24.44 ఎకరాలు, సర్వే నెంబర్ 489లో 4.71 ఎకరాలు కేటాయించారు. వారి పేరు మీద అప్పట్లోనే డైక్లాట్‌లో పొందుపరిచారు. అయితే ఎలా జరిగిందో కాని సాగులో మాత్రం వైసీపీకి చెందిన కొందరు నాయకులు, వారి బంధు, మిత్రవర్గం ఉన్నారు. గత కొన్నేళ్లుగా కమ్మర కులస్థులు ఆ భూమి కోసం పోరాటం చేసినట్లు సమాచారం. ఆ భూమిలో అధిక శాతం అగ్రవర్ణాలకు చెందిన వారు ఉండటం, గత ప్రభుత్వాలు వారికి అండగా నిలవడంతో కమ్మర కులస్థులను భయపెట్టినట్లు సమాచారం. అధికారులు చెబుతున్న మేరకు... రైతువారి పట్టా పొంది ఉండి, క్రయ విక్రయాలు జరిపి ఉంటే ఆ భూమి సాగులో ఉన్న వారిదే అవుతుందని చెప్పుకొస్తున్నారు. అలా జరగకపోయి ఉంటే ఆ భూమి కమ్మర కులస్థులకే చెందుతుందని రెవెన్యూ అధికారులు చెబుతున్నారు.

#### రికార్డులు తారుమారు

కమ్మర కులస్థులకు కేటాయించిన 24.44 ఎకరాలకు సంబంధించిన అన్ని రికార్డులు సాగుదారులు తమ పేరు మీద నమోదు చేసుకున్నారు. అప్పట్లో కొందరు రెవెన్యూ అధికారులు వీరికి సహకరించడంతో పాసుబుక్కులు, 1బీ అడంగల్ సృష్టించారు. డైక్లాట్‌లో కమ్మర కులస్థుల పేరుమీద భూమి ఉందని తెలిసినా... రెవెన్యూ అధికారుల సహకారం, రాజకీయ పలుకుబడితో మొత్తం భూమిని తమ ఆధీనంలో ఉంచుకున్నారు. పైగా ఇనామ్ భూమి పట్టాలు సృష్టించుకోవడంపై సర్వత్రా విమర్శలు వ్యక్తమవుతున్నాయి. సర్వే నంబర్ 486లో గోపాల్ రెడ్డి 1.21 ఎకరాలు, భూపతిరెడ్డి 4.07 ఎకరాలు, సుంకు కేదర్‌నాథ్ 2.85 ఎకరాలు, బిరెడ్డి మహేష్ రెడ్డి 2.04 ఎకరాలు, బైరెడ్డి వరలక్ష్మి 4.08 ఎకరాలు, బైరెడ్డి నాగలక్ష్మి 4.07 ఎకరాలు, బొజ్జె నందిని 2.03 ఎకరాలు, రామకుమార్ రెడ్డి 4.08 ఎకరాలు చొప్పున ఆన్‌లైన్‌లో నమోదు చేసుకున్నారు. భూమికి సంబంధించి ప్రభుత్వ పథకాలు కూడా అందుతుండటంతో ఎవరికీ ఆ భూమిపై అనుమానం రాలేదు. మరోవైపు వైసీపీ మండల కన్వీనర్ రామచంద్రారెడ్డి, ఆయన తమ్ముడు లక్ష్మీనారాయణరెడ్డితో పాటు మరికొందరు తమ భార్యల పేర్లు, కుమారులు, కుమార్తెల పేర్ల మీద రిజిస్ట్రేషన్‌లు చేయించారు. లింకు డాక్యుమెంట్ కోసం ఈ తతంగమంతా నడిపించినట్లు రెవెన్యూ రికార్డులను బట్టే స్పష్టంగా అర్థమవుతోంది.

#### డైక్లాట్‌లో కమ్మర పేరు మీదే ఉంది



కూడేరు మండలం ఉదిరిపికొండ రెవెన్యూ పరిధిలోని జల్లిపల్లి గ్రామ సమీపంలో ఉన్న సర్వే నెంబర్ 486లోని 24.44 ఎకరాల భూమి డైక్లాట్‌లో కమ్మర ఇనామ్‌గా ఉంది. అయితే ప్రస్తుతం ఆ భూముల్లో వేరొకరు సాగులో ఉన్నారు. ఈ సర్వే నంబరుకు రైతువారి పట్టా కేటాయించి ఉంటే విక్రయించే అవకాశం ఉంటుంది. రైతువారి పట్టా కేటాయించకపోతే అది కమ్మర కులస్థులకే చెందుతుంది. ఈ విషయంపై సమగ్ర విచారణ చేపట్టి చర్యలు తీసుకుంటాం.

-మహబూబ్ బాషా, ఇన్‌చార్జ్ తహసీల్దార్, కూడేరు

# చిలమత్తూరులో ఏసీబీ

### సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో తనిఖీలు

### కొంత నగదు స్వాధీనం.. రికార్డుల పరిశీలన



తనిఖీలు చేస్తున్న ఏసీబీ అధికారులు

హిందూపురం, చిలమత్తూరు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): చిలమత్తూరు సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంపై ఏసీబీ అధికారులు బుధవారం దాడులు నిర్వహించారు. ఏసీబీ అనంతపురం జిల్లా కార్యాలయ ఇన్‌స్పెక్టర్ జయమ్మ ఆధ్వర్యంలో 9 మంది సిబ్బంది తనిఖీలు చేపట్టారు. సబ్ రిజిస్ట్రార్ కార్యాలయంలో అవినీతి పెరిగిపోయిందని ఇటీవల ఆరోపణలు వస్తున్నాయి. అయితే, కార్యాలయంలో అవినీతి జరుగుతున్నట్లు తమకు ఫిర్యాదు అందలేదని, ఉన్నతాధికారుల ఆదేశాలతో తనిఖీలు చేపట్టామని ఇన్‌స్పెక్టర్ జయమ్మ తెలిపారు. ఏసీబీ అధికారులు మధ్యాహ్నం ఒంటి గంట సమయంలో కార్యాలయంలోకి ప్రవేశించి, తలుపులు మూసేశారు. కార్యాలయం లోపల ఉన్న సబ్ రిజిస్ట్రార్ ప్రసాద్, ఇతర ఉద్యోగుల నుంచి సెల్‌ఫోన్లను స్వాధీనం చేసుకున్నారు. కార్యాలయం లోపల ఉన్న ప్రైవేటు వ్యక్తులు, విలేకరులు, రిజిస్ట్రేషన్, ఇతర పనుల మీద వచ్చినవారిని బయటకు వెళ్లనివ్వలేదు. 'ఎందుకు వచ్చారు? రిజిస్ట్రేషన్లు చేయించారా? అదనంగా డబ్బులు చెల్లించారా..?' అని వారిని ప్రశ్నించారు. కార్యాలయంలో జరిగే అవినీతి కార్యకలాపాల సమాచారాన్ని రాబట్టే ప్రయత్నం చేశారు. ఆ తరువాత కార్యాలయంలో పనిచేసే ప్రైవేటు వ్యక్తులు, దస్తావేజు లేఖరులు మినహా.. మిగిలినవారిని పంపించేశారు. అనంతరం రికార్డుల తనిఖీ ప్రారంభించారు. ఇటీవల జరిగిన రిజిస్ట్రేషన్లు, జారీ చేసిన ఈసీలు, నకళ్లు, ఇతర లావాదేవీల వివరాలను పరిశీలించారు. రిజిస్ట్రేషన్ చలానాలను పరిశీలించారు. సబ్ రిజిస్ట్రార్, ఉద్యోగులు, ప్రైవేటు వ్యక్తులు, దస్తావేజు లేఖరుల ఫోన్ పే లావాదేవీలను పరిశీలించినట్లు సమాచారం. ఏసీబీ సీఐ హమీద్‌ఖాన్ సాయంత్రం చేరుకుని, తనిఖీలలో పాలుపంచుకున్నారు. కార్యాలయంలో కొంత నగదు పట్టుబడినట్లు విశ్వసనీయ సమాచారం. తనిఖీలు గురువారం కూడా కొనసాగుతాయని, అప్పటి వరకు పూర్తి సమాచారం చెప్పలేమని సీఈబీ అధికారులు అన్నారు.

## రైల్వే ట్రాక్ పరిశీలన

గుంతకల్లు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రైల్వే డివిజన్ పరిధిలోని గుంతకల్లు-క్రిష్ణా సెక్షన్‌లో డీఆర్‌ఎం చంద్రశేఖర్ గుప్తా బుధవారం ఉదయం తనిఖీలు నిర్వహించారు. ప్రత్యేక రైలులో బయలుదేరిన డీఆర్‌ఎం రీర్ విండో ద్వారా ట్రాక్‌ను పరిశీలించారు. బలహీనపడిన, అభివృద్ధి చేయాల్సిన ప్రదేశాలను డీఆర్‌ఎం, ఆయన వెంట వెళ్లిన సాంకేతిక సిబ్బంది గుర్తించారు.

## పడిపోతున్నట్లు నటించి.. డబ్బు కాజేశారు..

### ఏడు నెలల తర్వాత ముగ్గురు నిందితుల అరెస్టు

బత్తలపల్లి, నవంబరు5(ఆంధ్రజ్యోతి): ప్రమాదంలో పడిపోతున్నట్లు నటించి ఓ వ్యక్తి నుంచి డబ్బు కాజేసిన కేసులో ముగ్గురు నిందితులను పోలీసులు ఏడు నెలల తర్వాత అరెస్టు చేశారు. చిత్తూరు నగరంలోని స్టాలిన్ నగర్‌కు చెందిన మేకల లోకేశ్, తోట రాకేష్, తోట ఇమ్మాన్యుయల్‌ను అరెస్టు చేశారు. ఇందుకు సంబంధించిన వివరాలను స్థానిక పోలీసు స్టేషన్‌లో డీఎస్పీ హేమంత్‌కుమార్ బుధవారం వెల్లడించారు. చిత్తూరులోని లెనిన్ నగర్‌కు చెందిన నిందితులు ముగ్గురు ముఠాగా ఏర్పడ్డారు. మోసాల ద్వారా డబ్బు సంపాదించాలనుకున్నారు. అందులో భాగంగా బత్తలపల్లిలోని విజయనగర్ కాలనీకి చెందిన అయ్యప్ప ఈ ఏడాది మార్చి 8వ తేదీన ధర్మవరం రోడ్డులోని ధర్మేంద్రరెడ్డి ఎలక్ట్రికల్ షాపు వద్ద నిలబడి ఉండగా.. మేకల లోకేశ్ తొలుత ద్విచక్రవాహనంలో వచ్చాడు. అయ్యప్ప సమీపంలో ద్విచక్రవాహనం పడిపోతున్నట్లు నటిస్తూ.. సాయం కోరాడు. దానిని నమ్మిన అయ్యప్ప.. లోకేశ్‌కు సాయం చేసేందుకు వెళ్లాడు. అంతలోనే రాకేష్, ఇమ్మాన్యుయేల్ మరో బైక్‌లో వచ్చారు. సాయం చేస్తున్నట్లు నటించారు. ఆ సమయంలో అయ్యప్పను ఏమార్చి అతడి జేబులోని మొబైల్‌ను అపహరించారు. ఫోన్ పే ద్వారా అతడి ఖాతాలోని రూ.1.82 లక్షల సొమ్మును బదిలీ చేసుకున్నారు. తర్వాత మొబైల్ చోరీ అయిందంటూ అయ్యప్ప.. పోలీసులకు ఫిర్యాదు చేశాడు. ఆ మేరకు కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. అందులో భాగంగా మేకల లోకేశ్, తోట రాకేష్, తోట ఇమ్మాన్యుయేల్‌ను బత్తలపల్లిలోని ఆర్యన్ ధాబా వద్ద అరెస్టు చేశారు. ఉపయోగించిన బైక్, రూ.70 వేల నగదు స్వాధీనం చేసుకున్నట్లు డీఎస్పీ వివరించారు. సమావేశంలో సీఐ ప్రభాకర్, ఎస్ఐ సోమశేఖర్ పాల్గొన్నారు.



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న డీఎస్పీ

## పంట అమ్మిన సొమ్ము కాజేశారు

- రైతు ఖాతా నుంచి రూ.2.92 లక్షలు కాజేసిన సైబర్ నేరగాళ్లు

కళ్యాణదుర్గంరూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఆరుగాలం శ్రమించి పండించిన పంటను విక్రయించగా.. వచ్చిన సొమ్మును సైబర్ నేరగాళ్లు కాజేశారు. రైతు ఖాతాలో నగదును మాయం చేశారు. మండలంలోని పాలవెంకటాపురం గ్రామానికి చెందిన రైతు దాసరి నాగార్జున తెలిపిన వివరాలిలా ఉన్నాయి. ఇటీవల మూడెకరాల్లో టమోటా సాగు చేశాడు. దిగుబడి విక్రయించగా.. వ్యాపారులు.. రైతు ఖాతాకు రూ.2.92 లక్షలు జమ చేశారు. ఆ సొమ్మును వేరుశనగ పంట సాగు పెట్టుబడి కోసం ఖాతాలోని ఉంచుకున్నాడు. ఈ క్రమంలో ఈనెల 4న రైతు ఖాతా నుంచి రూ.2.92 లక్షల నగదు డెబిట్ అయినట్లు మొబైల్‌కు మెసేజ్ వచ్చింది. రైతు నాగార్జున అప్రమత్తమై బ్యాంకు స్టేట్‌మెంట్ తీసుకున్నాడు. అందులో సొమ్ము వేరే ఖాతాకు బదిలీ అయినట్లు తేలడంతో రైతు ఖంగుతిన్నాడు. వెంటనే అనంతపురం సైబర్ క్రైమ్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. బుధవారం కళ్యాణదుర్గం రూరల్ పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. పంట అమ్మిన సొమ్ము సైబర్ నేరగాళ్లు దోచుకోవడంతో రైతు లబోదిబోమంటున్నాడు.

## రైల్వే గేట్ తాత్కాలిక మూసివేత

గుత్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణ శివారులోని కర్నూలు రోడ్డులో ఉన్న రైల్వేగేట్‌ను బుధవారం నుంచి మూడు రోజుల పాటు మూసివేస్తున్నట్లు రైల్వే అధికారులు తెలిపారు. ట్రాక్ మరమ్మతుల కారణంగా రైల్వే గేట్‌ను మూసివేస్తున్నామన్నారు.

## యువకుడి మృతి

బొమ్మనహాళ్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఉద్దేహాళ్ గ్రామానికి చెందిన తారమ్మ, నబీరసూల్ కుమారుడు ఆజీముద్దీన్ (26) ద్విచక్రవాహనంలో బళ్లారికి బుధవారం బయలుదేరాడు. బళ్లారి సమీపంలోని చెరకుంట గ్రామ సమీపంలో మలుపు వద్ద బైక్ అదుపుతప్పడంతో అతను కిందపడి అక్కడికక్కడే మరణించాడు. బళ్లారి రూరల్ పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## రేపు హాకీ వందేళ్ల వేడుకలు

అనంతపురం క్లాక్‌టవర్, నవంబరు 5 (ఆంధ్రజ్యోతి): జాతీయ క్రీడ హాకీ వందేళ్ల వేడుకలు ఈనెల 7వ తేదీన ఘనంగా నిర్వహించనున్నట్లు హాకీ అనంతపురం ప్రధాన కార్యదర్శి అనిల్‌కుమార్ తెలిపారు. స్థానిక ఆ సంఘం జిల్లా కార్యాలయంలో బుధవారం జిల్లా కమిటీ సమావేశం నిర్వహించారు. హాకీ వందేళ్ల వేడుకల నిర్వహణపై చర్చించారు. నగరంలో మొదట ర్యాలీ, అనంతరం సీనియర్, ఉత్తమ క్రీడాకారులకు సన్మానం చేయనున్నట్లు సభ్యులు తెలిపారు. సమావేశంలో ఆ సంఘం జిల్లా అధ్యక్షుడు విజయబాబు, ఉపాధ్యక్షుడు మహేష్, కోశాధికారి హిమబిందు పాల్గొన్నారు.

## మహిళ ఆత్మహత్య



గాయత్రి (ఫైల్)

బత్తలపల్లి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని ముస్టూరు గ్రామానికి చెందిన గాయత్రి(21) బుధవారం ఉరి వేసుకున్నారు. భర్త వేధింపులు భరించలేక తమ కూతురు ఆత్మహత్యకు పాల్పడిందని గాయత్రి తల్లిదండ్రులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. ఎస్ఐ సోమశేఖర్ తెలిపిన మేరకు, ముస్టూరుకు చెందిన హరిప్రసాద్‌కు కడప జిల్లా సింహాద్రిపురం మండలం నిడివెలగల గ్రామానికి చెందిన నిర్మల, సోమయ్య దంపతుల కూతురు గాయత్రితో ఆరేళ్ల క్రితం వివాహం జరిగింది. హరిప్రసాద్ కూలి పనులు చేస్తుంటాడు. ఆర్థిక ఇబ్బందులు ఉండటంతో అవసరానికి గాయత్రి తల్లిదండ్రులు సాయం చేసేవారు. కానీ ఆ డబ్బుతో హరిప్రసాద్ మద్యం సేవించి, భార్యను ఇబ్బంది పెట్టేవాడు. భర్త వేధింపులు భరింలేకున్నానని, ఇక బతకనని గాయత్రి తల్లిదండ్రులకు ఫోన్ చేసి ఆవేదన వ్యక్తం చేశారు. వారు సర్ది చెప్పారు. అయినా ఫలితం లేకపోయింది. గాయత్రికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. సంఘటనా స్థలాన్ని ఎస్ఐ పరిశీలించారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

## కుటుంబ కలహాలతో బ్యాంకు మేనేజర్ ఆత్మహత్య



గోగర్ (ఫైల్)

తాడిపత్రి, నవంబరు5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో యూనియన్ బ్యాంకు మేనేజర్ గోగర్ (40) బుధవారం ఆత్మహత్య చేసుకున్నాడు. పట్టణ సీఐ ఆరోహణరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. పంజాబ్ రాష్ట్రం పాటియాలా పట్టణానికి చెందిన గోగర్ ఏడాది క్రితం బ్యాంకు మేనేజర్‌గా తాడిపత్రికి వచ్చారు. పట్టణంలోని మెయిన్ బజారు సమీపంలో గది అద్దెకు తీసుకున్నారు. అతడి భార్య కూడా బ్యాంకు ఉద్యోగి. కొంతకాలంగా ఇరువురి మధ్య మనస్పర్ధలు ఉన్నాయి. ఈ నేపథ్యంలో వారంరోజుల క్రితం భార్య విడాకుల నోటీసు పంపింది. దీంతో తీవ్ర మనోవేదనకు లోనైన గోగర్ తనకు బతకాలని లేదని తోటి ఉద్యోగులతో చెబుతుండేవాడు. ఈ నేపథ్యంలోనే తీవ్ర మనస్తాపం చెంది బుధవారం తన గదిలో ఫ్యాన్‌కు ఉరేసుకుని, మరణించాడు. బ్యాంకుకు రాకపోవడంతో సిబ్బంది మెసేజ్ పెట్టారు. అయినా స్పందన లేకపోవడంతో గది వద్దకెళ్లారు. తలుపు తీయకపోవడంతో కిటికీ తెరిచి చూడగా.. ఉరికి వేలాడుతూ కనిపించాడు. వెంటనే పోలీసులకు సమాచారం అందించారు. పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని, మృతదేహాన్ని ఆస్పత్రికి తరలించారు. గోగర్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. కుటుంబ సభ్యులు వస్తే పూర్తి వివరాలు తెలుస్తాయని పోలీసులు చెప్పారు.

## మహిళ హత్య కేసులో మరొకరి అరెస్టు



అరెస్టు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రెడ్డప్ప

ధర్మవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మహిళ హత్య కేసులో పరారీలో ఉన్న నిందితుడిని టూటౌన్ పోలీసులు అరెస్టు చేశారు. అందుకు సంబంధించిన వివరాలను స్థానిక స్టేషన్‌లో బుధవారం సీఐ రెడ్డప్ప వెల్లడించారు. చెన్నేకొత్తపల్లి మండలం మేడాపురం గ్రామానికి చెందిన సాకే వెంకటరాముడు ధర్మవరం పట్టణంలోని ఇందిరమ్మ కాలనీలో భార్య సరస్వతితో కలిసి నివాసం ఉండేవాడు. సరస్వతిపై అనుమానం పెంచుకున్నాడు. ఆమెను హతమార్చాలనుకున్నాడు. తన అక్క చిట్టెమ్మ, ఆమె భర్త రామంజనేయులు, మరో అక్క వెంకటలక్ష్మి, వదిన రామాంజినమ్మ సాయంతో సరస్వతిని ఈ ఏడాది సెప్టెంబరులో చంపేసి నరసింహులు, విజయ్ సాయంతో పట్టణ సమీపంలోని గొల్లపల్లి వంకలో పూడ్చిపెట్టారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా సరస్వతిని భర్తే చంపేసినట్లు పోలీసులు తేల్చారు. ఏడుగురిపై కేసు నమోదు చేశారు. వారిలో ఆరుగురిని ఇదివరకే అరెస్టు చేశారు. వెంకటరాముడు బావ రామాంజనేయులు తప్పించుకు తిరుగుతుండేవాడు. ఈ నేపథ్యంలో అతడిని ధర్మవరంలోని లక్ష్మీచెన్నకేశవపురం సమీపంలోని పీహెచ్‌సీ వద్ద ఉండగా బుధవారం అరెస్టు చేసినట్లు సీఐ తెలిపారు. ఈ కేసులో ఏడుగురినీ అరెస్టు చేశామన్నారు.

## పీఎండీడీకేపై కార్యాచరణ సిద్ధం చేయండి: కలెక్టర్

పుట్టపర్తి టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ప్రధానమంత్రి ధనధాన్య కృషి యోజన దీర్ఘకాలిక లక్ష్యాలు-ప్రయోజనాలపై జిల్లా కార్యాచరణ ప్రణాళికను రూపొందించాలని కలెక్టర్ శ్యాంప్రసాద్ అధికారులను ఆదేశించారు. కలెక్టరేట్‌లో వివిధ శాఖల అధికారులతో బుధవారం సమీక్ష నిర్వహించారు. వ్యవసాయ రంగ అభివృద్ధి, రైతుల ఆదాయ వృద్ధి, ఆహార భద్రత లక్ష్యంగా జిల్లా కార్యాచరణ ఉండాలని అన్నారు. పంటల వైవిధ్యం, స్థిరమైన వ్యవసాయ పద్ధతులను ప్రోత్సహించడం, పంటకోత, నిల్వ సామర్థ్యాన్ని పెంచడం, నీటిపారుదల మౌలిక సదుపాయాలను మెరుగుపరచడం, స్వల్ప, దీర్ఘకాలిక వ్యవసాయ రుణాలకు ప్రాధాన్యం, మెరుగైన పాలన, సేవ బట్వాడా వనరుల సద్వినియోగం తదితర అంశాలు ఇందులో భాగం కావాలని సూచించారు. సమావేశంలో జిల్లా వ్యవసాయ అధికారి రామునాయక్, ఉద్యానశాఖ అధికారి చంద్రశేఖర్, ఏపీఎంఐపీ పీడీ సుదర్శన్, మత్స్యశాఖ అధికారి చంద్రశేఖర్ రెడ్డి, భూగర్భ శాఖ అధికారి రాజశేఖర్, పశుసంవర్ధక అధికారి శుభదాసు, ఇరిగేషన్ అధికారి గురుమూర్తి, సెరికల్చర్ అధికారి శోభారాణి, జిల్లా సహకార అధికారి క్రిష్ణా నాయక్, ఎల్డీఎం రమణకుమార్, పరిశ్రమల శాఖ అధికారి నాగరాజు, స్కిల్ డెవలప్‌మెంట్ అధికారి హరికృష్ణ తదితరులు పాల్గొన్నారు.

## గేట్ల మరమ్మతులకు రూ.29 లక్షలు

### త్వరితగతిన పనులు పూర్తి చేస్తాం: మంత్రి సత్యకుమార్ యాదవ్

ధర్మవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కూడేరు మండలంలోని పెన్నహోబిలం బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ (పీఏబీఆర్) కుడివైపు హెడ్ స్లూయిస్ గేట్ల మరమ్మతులకు రూ.29 లక్షల నిధులను జలవనరుల శాఖ మంజూరు చేసినట్లు రాష్ట్ర వైద్యఆరోగ్యశాఖ మంత్రి సత్యకుమార్ యాదవ్ బుధవారం ప్రకటనలో తెలిపారు. వెంటనే పనులు చేపట్టి త్వరితగతిన పూర్తి చేస్తామన్నారు. పీఏబీఆర్ ఉమ్మడి జిల్లా రైతాంగానికి జీవనాధారమన్నారు. గేట్ల లోపాల కారణంగా కొన్నేళ్లుగా సాగునీటి విడుదలలో ఆలస్యమవుతోందన్నారు. సమస్యను ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించామన్నారు. పనులు పూర్తయిన వెంటనే కుడికాలువకు నీరు విడుదల చేస్తారన్నారు. తద్వారా రైతులు పంటలు సాగు చేసుకోవచ్చని మంత్రి ప్రకటనలో వివరించారు.

## కానిస్టేబుళ్ల తాత్కాలిక బదిలీ

పుట్టపర్తి రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జిల్లాలో 15 మంది కానిస్టేబుళ్లను తాత్కాలికంగా బదిలీ చేస్తూ ఎస్పీ సతీష్ కుమార్ బుధవారం ఉత్తర్వులు జారీ చేశారు. కేటాయించిన స్టేషన్లలో వెంటనే విధుల్లో చేరాలని ఆదేశించారు. విధుల్లో చేరినవారి వివరాలను తన కార్యాయానికి పంపాలని ఎస్‌హెచ్‌ఓలను ఆదేశించారు. తదుపరి ఉత్తర్వులు వెలువడేదాకా కేటాయించిన స్టేషన్లలో కానిస్టేబుళ్ళు విధులు నిర్వర్తించాల్సి ఉంటుందని ఎస్పీ తెలిపారు.

# భక్తిశ్రద్ధలతో లక్ష దీపోత్సవం


పుట్టపర్తి హనుమాన్ గుడి ప్రాంగణంలో కార్తీక దీపాలు

పుట్టపర్తి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమి రోజు లక్ష దీపార్చన చేపట్టారు. ఓంశాంతి ఆధ్వర్యంలో స్థానిక ఆర్‌వీ జానకిరామయ్య కల్యాణమండపం వెనుక భాగంలో క్రికెట్ గ్రౌండ్ నందు బుధవారం లక్ష దీపార్చన చేపట్టారు. వంద లాది మంది భక్తులు పాల్గొని దీపాలు వెలిగించారు.

● ధర్మవరం: పట్టణంలోని శివాలయాల్లో కార్తీక పౌ ర్ణమి వేడుకలు ఘనంగా నిర్వహించారు. లక్ష్మీనగర్, శివానగర్, గాంధీనగర్ శివాలయాలతో పాటు పలు దేవాలయాల్లో ప్రత్యేకంగా అలంకరించి పూజలు చేశారు. అనంతరం జ్వాలాతోరణ కార్యక్రమాన్ని నిర్వహించారు. గాంధీనగర్‌లో మంచుకొండల్లో ఉన్న శివుడు భక్తులకు దర్శనమిచ్చారు.

● కదిరి : పట్టణంలోని శివాలయం, లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో కార్తీక పౌర్ణమి వేడుకలు నిర్వహించారు. శివాలయంలో ఎమ్మెల్యే కందికుంట వెంకటప్రసాద్ స్వామిని దర్శించుకుని పూజలు చేశారు.


ధర్మవరంలో మంచుకొండల్లో శివలింగం


కదిరి శివాలయంలో ఎమ్మెల్యే కందికుంట పూజలు

## వ్యక్తిపై కేసు నమోదు

కదిరిఅర్బన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని కాళసముద్రం వద్ద అక్టోబరు 23న జరిగిన రోడ్డుప్రమాదానికి కారణమైన వ్యక్తిపై కేసు నమోదు చేసినట్లు అప్‌గ్రేడ్ సీఐ నీరంజన్‌రెడ్డి బుధవారం తెలిపారు. ముదిగుబ్బకు చెందిన బాలరాజు కదిరి నుంచి ద్విచక్రవాహనంపై వెళుతుండగా కాళసముద్రం వద్ద వెనుక నుంచి హరిప్రసాద్ అనే వ్యక్తి కారుతో ఢీకొట్టాడన్నారు. ఈ మేరకు హరిప్రసాద్‌పై కేసు నమోదు చేసినట్లు తెలిపారు.







## ఘనంగా సత్యసాయి గిరిప్రదర్శన


గిరిప్రదర్శనలో పాల్గొన్న భక్తులు

పుట్టపర్తి, నవంబరు5(ఆంధ్రజ్యోతి): సత్యసాయి గిరిప్రదర్శనను బుధవారం రాత్రి భక్తులు ఘనంగా నిర్వహించారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా రాత్రి 6.30 గంటలకు ప్రశాంతి నిలయం గణేష్ గేటు వద్ద సత్యసాయి రథానికి ప్రత్యేక అలంకరణ చేసి పూజలు చేశారు. అనంతరం సత్యసాయి రథాన్ని లాగుతూ భక్తి పాటలు పాడుతూ నగర సంకీర్తన నిర్వహించారు. నగర సంకీర్తన గోకులం ఎనుములపల్లి గణేష్ సర్కిల్ పెట్రోల్ బంకు చింతతోపు గోవిందపేట శివాలయం వీధి, గోపురం రోడ్డు మీదుగా తిరిగి గణేష్ గేటు వద్దకు చేరుకుంది. మంగళహారతితో గిరి ప్రదర్శన ముగించి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేపట్టారు. కార్తీక పౌర్ణమి సందర్భంగా వందలాది భక్తులు పాల్గొన్నారు.







# కలిసికట్టుగా సమస్యలను పరిష్కరిద్దాం: ఎమ్మెల్యే


మాట్లాడుతున్న ఎమ్మెల్యే సింధూరారెడ్డి

ఓబుళదేవరచెరువు, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కలిసికట్టుగా పనిచేసి ప్రజా సమస్యలను పరిష్కరించాలని ఎమ్మెల్యే పల్లె సింధూరారెడ్డి అధికారులు, ప్రజా ప్రతినిధులకు సూచించారు. బుధవారం ఎంపీడీఓ కార్యాలయంలో ఎంపీపీ తుమ్మల పర్వీన్ అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి హాజరైన ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రజాస మస్యల పరిష్కారం కోసం అధికారులు వాట్సప్ గ్రూప్‌ను ఏర్పాటు చేసుకొని పరిష్కరించే దిశగా ముందుకెళ్లాలని తెలిపారు. గ్రామీణ ప్రాంతాల్లో తాగునీరు, పారిశుధ్యం, సిమెంట్ రోడ్లు తదితర సమస్యలపై దృష్టి సారించాలన్నారు. మండల కేంద్రంతో పాటు గ్రామాల్లో కుక్కలు బెడద ఎక్కువగా ఉన్నట్లు ప్రజల నుంచి ఫిర్యాదులు వస్తున్నాయన్నారు. వాటి పరిష్కారానికి నెలలోపు ప్రత్యేక డ్రైవ్ నిర్వహించేలా చర్యలు తీసుకోవాలని ఎంపీడీఓ శివరామప్రసాద్‌రెడ్డికి సూచించారు. నియోజకవర్గంలో కిడ్నీ వ్యాధిగ్రస్థులు ఎక్కువగా ఉన్నారని, డయాలసిస్ కేంద్రాలు ఏర్పాటు చేయాలని మార్కెట్ యార్డ్ చెర్మన్ పూల శివప్రసాద్ ఎమ్మెల్యే దృష్టికి తీసుకెళ్లారు. గత ప్రభుత్వ హయాంలో మంజూరైన పక్కా గృహాలను ఇంకా నిర్మించుకోనివారు ఉంటే నోటీసులు ఇచ్చి వాటిని రద్దు చేయాలని తహసీల్దార్ శ్రీనివాసరెడ్డి, హౌసింగ్ ఏఈ అరుణ్‌కుమార్‌కు సూచించారు. సమావేశంలో వైఎస్ ఎంపీపీ లక్ష్మీదేవి, సీడీపీఓ గాయత్రి, ఏఓ ఇలియాజ్ అహ్మద్, హెచ్‌ఓ లావణ్య పాల్గొన్నారు.










## జేవీవీ కృషి అభినందనీయం : కలెక్టర్


పుట్టపర్తి టౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): జాతీయ ఉపకార వే తన అర్హత పరీక్షకు సంబంధించిన విషయం పరిజ్ఞానాన్ని విద్యార్థులకు అందించే నేషనల్ మీన్స్ స్కాలర్‌షిప్స్ (ఎన్ఎంఎంఎస్) అనే పుస్తకాన్ని రూపొందించిన జనవిజ్ఞాన వేదిక, ఐక్య ఉపాధ్యాయ సంఘం కృషి అభినందనీయమని కలెక్టర్ ఎ.శ్యాంప్రసాద్ పేర్కొన్నారు. బుధవారం ఎన్ఎంఎంఎస్ పుస్తకాలను కలెక్టర్, జిల్లా విద్యాశాఖాధికారి బి.కిష్టప్ప, సర్వశిక్ష అభియాన్ ఏపీసీ డాక్టర్ పి.దేవరాజ్‌తో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మా ట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలలో ఎనిమిదో తరగతి చదువుతున్న విద్యార్థులు ఈ అర్హత పరీక్షలో విజయం సాధిస్తే.. కేంద్ర ప్ర భుత్వం సంవత్సరానికి రూ.12 వేల చొప్పున నాలుగు సంవత్సరాలు స్కాలర్‌షిప్ ఇస్తుందన్నారు. కార్యక్రమంలో నాయకులు శెట్టిపి జయచంద్రారెడ్డి, డాక్టర్ ఎం.ఆదిశేషు, బి.నరసారెడ్డి, లోకేష్, లక్ష్మీనారాయణ, శివకుమార్ తదితరులు పాల్గొన్నారు.

## మూడు రోజులు తాగునీటి సరఫరా బంద్

ధర్మవరం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ధర్మవరం పట్టణంలో ఈనెల 11,12,13 తేదీల్లో మూడు రోజులపాటు తాగునీటి సరఫరా నిలిపివేస్తామని ఇన్‌చార్జ్ కమిషనర్ సాయికృష్ణ, డీఈ వీరేశ్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ధర్మవరం పట్టణానికి అవసరమయ్యే తాగునీటిని పార్నపల్లి డ్యాం తంబాపురం తిక్కస్వామి నగర్ వద్దగల ఫిల్టర్ రేషన్ ప్లాంటుకు పెద్ద మోటార్ల ద్వారా పంపిణీ చేస్తామన్నారు. కొత్త ఎంఎస్ మ్యానిఫర్డ్ తయారుచేసి అమర్చడం కోసం మూడు రోజులు సమయం పడుతుందన్నారు. పట్టణ ప్రజలు నీటిని పొదుపుగా వాడుకోవాలని తెలిపారు.

## వీల్‌చైర్లు పంపిణీ

పుట్టపర్తిరూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల పరిధిలోని బొంతలపల్లిలో మానసిక దివ్యాంగులకు కిద్మత్-ఏ-ఖల్క్ ఆధ్వర్యంలో మాజీమంత్రి పల్లె రఘునాథరెడ్డి రూ.20వేల విలువైన రెండు వీల్‌చైర్లను అందచేశారు. బుధవారం గ్రామంలోని నిరుపేద మానసిక దివ్యాంగులైన అపర్ణ, సునీల్‌కు మాజీమంత్రి చేతుల మీదుగా వీటిని అందచేశారు. అనంతరం మాజీమంత్రి పల్లె మాట్లాడుతూ.. దివ్యాంగులకు ఎలాంటి అవసరమున్నా తన దృష్టికి తేవాలని, వారి సమస్యలను పరిష్కరిస్తానని అన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ శ్రీనివాసులు, కిద్మత్ ఏ ఖల్క్ చారిటబుల్ ట్రస్టు సభ్యులు షామీర్, అలీ, రామాంజనేయులు, టీడీపీ నాయకుడు కోనంకి గంగాధర్‌నాయుడు పాల్గొన్నారు.



# ఘనంగా కార్తీక దీపోత్సవం

• భక్తులతో కిటకిటలాడిన శివాలయాలు


పెనుకొండ కాశీవిశ్వేశ్వరాలయంలో దీపాలు వెలగిస్తున్న భక్తులు


గుట్టూరు ఆలయం వద్ద అన్నదానం చేస్తున్న భక్తులు

పెనుకొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పు రస్కరించుకుని స్థానిక కాశీ విశ్వేశ్వరస్వామి ఆలయంలో బుధవారం లక్ష దీపారాధన మహోత్సవం ఘనంగా నిర్వహించారు. ఉదయం అర్చకుల ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు అనంతరం సామూహిక హోమాలు నిర్వహించారు. కొండపై శిఖరజ్యోతి వెలిగించి భక్తులకు దర్శనం కల్పించారు. అనంతరం కృత్తికా దీపోత్సవం నిర్వహించారు. వేద పండితుల ఆధ్వర్యంలో రాత్రి ఆలయం వద్ద పెద్దఎత్తున దీపారాధన అనంతరం గిరిజా కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగాయి. భక్తులకు కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో తీర్థప్రసాద వినియోగం గావించారు. ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు చోటుచేసుకోకుండా ఎస్ఐ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో బందోబస్తున నిర్వహించారు. మహిళలు భోగసముద్రం చెరువులో కార్తీక దీపాలను వెలిగించారు.

● మడకశిరటౌన్: పట్టణంలోని చంద్రమౌళీశ్వరస్వామి ఆలయంలో స్వామివారికి రుద్రాభిషేకం, ప్రాకారోత్సవం, కార్తీక దీపారాధన, అభిషేకాలు, అర్చనలు, శివపార్వతులకు గ్రామోత్సవం నిర్వహించారు. సాయంత్రం తెప్పోత్సవాన్ని కన్నుల పండువగా నిర్వహించారు. అదేవిధంగా మిట్టబండ ఆంజనేయస్వామి, అభయాంజనేయస్వామి, భోగిరామలింగేశ్వరస్వామి, కోట వెంకటేశ్వరస్వామి, ఆంజనేయస్వామి ఆలయాల్లో కార్తీక మాసపూజలు జరిగాయి.

● రొద్దం: కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని బుధవారం మండల కేంద్రంలోని ముత్యాలమ్మ దేవాలయంలో ప్రత్యేక పూజలు జరిగాయి. ఉదయం నుంచి అమ్మవారికి కుంకుమార్చన తదితర పూజల అనంతరం హోమాన్ని అర్చకులు నిర్వహించారు. పూజల్లో హిందూపురం పార్లమెంట్ టీడీపీ అధికార ప్రతినిధి రొద్దం నరసింహులు, నాయకులు చిన్నప్పయ్య, నాగభూషణం, అశ్వర్థనారాయణ, కోళ్ల శ్రీనివాసులు, సిద్దన్న పాల్గొన్నారు.

● పెనుకొండ రూరల్: మండలంలోని గుట్టూరులో సిద్ధరామేశ్వర ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని ఆలయంలో సత్యనారాయణవ్రతం నిర్వహించారు. భక్తులకు వాసుదేవరెడ్డి, మల్లికార్జున, కొండారెడ్డి ఆధ్వర్యంలో అన్నదానం నిర్వహించారు.

● హిందూపురం: కె. బసవనపల్లి శివాలయ ఆవరణంలో లక్ష దీపోత్సవం జరిగింది. అదేవిధంగా సిల్కు కాలనీ, శ్రీకంఠపురం నీలకంఠేశ్వర ఆలయాల్లో భక్తులు దీపాలను వెలిగించారు.

● గుడిబండ: మండలంలోని ఎస్.రాయాపురం కురుబరపల్లి బీటీపల్లి హిరేతుర్పి గ్రామాల్లో వెలసిన ఆంజనేయస్వామి ఆలయాల్లో భక్తులు ఘనంగా కార్తీక పౌర్ణమి పూజలునిర్వహించారు.

## లేపాక్షి ఆలయంలో జ్వాలాతోరణం

లేపాక్షి(ఆంధ్రజ్యోతి): కార్తీక పౌర్ణమిని పురస్కరించుకుని లేపాక్షి దుర్గా, వీరభద్రస్వామి ఆలయంలో జ్వాలాతోరణం పూజలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ అర్చకులు నర్సింహాశర్మ, శ్రీనివాసరావు దుర్గావీరభద్రస్వాములను ప్రత్యేకంగా అలంకరించి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం ఆలయంలో జ్వాలాతోరణం పూజలు నిర్వహించి భక్తులకు తీర్థ ప్రసాదాలు అందించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి దుర్గావీరభద్రస్వాములను దర్శించుకున్నారు.

## అభివృద్ధిని చూసి పార్టీలోకి వస్తున్నారు

### టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి

మడకశిరటౌన్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో కూటమి ప్రభుత్వ చేపడుతున్న అభివృద్ధి పనులకు ఆకర్షితులై వైసీపీ నాయకులు టీడీపీలోకి చేరుతున్నట్లు టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు గుండుమల తిప్పేస్వామి అన్నారు. బుధవారం బాలాజీ నగర్‌లోని టీడీపీ కార్యాలయంలో అగళి మండలానికి చెందిన హళ్లికెర గొల్లహట్టి తిమ్మరాయప్ప, చిత్తప్ప, ముకుందప్ప, ఆనంద్, మూడ్లప్పతోపాటు 20 మంది వైసీపీకి చెందిన నాయకులు టీడీపీ తీర్థం పుచ్చుకొన్నారు. వీరికి గుండుమల తిప్పేస్వామి పార్టీ కండువాలు వేసి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే అభివృద్ధి పరుగులు పెడుతోందన్నారు. జడ్పీటీసీ సభ్యులు ఉమేష్, మండల కన్వీనర్ తిప్పేస్వామి, సింగిల్‌విండో అధ్యక్షులు కుమారస్వామి, నాయకులు జయప్ప, కిష్టప్ప పాల్గొన్నారు.

### రోడ్డు పనులు పూర్తయ్యేలా చర్యలు తీసుకోండి

మడకశిరటౌన్(ఆంధ్రజ్యోతి): గత ప్రభుత్వంలో పలు రహదారుల పనులు సగంలోనే ఆగాయని, దీనివల్ల ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని వెంటనే పనులు పూర్తయ్యేలా చూడాలని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షులు గుండుమల తిప్పేస్వామి ఆర్‌అండ్‌బీ రాష్ట్ర ఈఎన్‌సీ శ్రీనివాసరెడ్డిని కోరారు. బుధవారం ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో ఎస్ఈ ఈఈ సంజీవయ్య, డీఈ లక్ష్మీనారాయణ, ఏఈ నరసింహమూర్తి తదితరులతో ఆయన సమావేశమయ్యారు. అమరాపురం నుంచి విరుపసముద్రం వెళ్లే రహదారి నిర్మాణ పనులను పూర్తి చేయాలని రోడ్డు గుంతలమయంగా ఉందని ఆయన దృష్టికి తీసుకెళ్లారు.




## ఆదర్శ పాఠశాల తనిఖీ

అగళి, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని ఏపీ ఆదర్శపాఠశాలను విద్యాశాఖ ఏడీ వినయ్‌మోహన్ బుధవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. రికార్డులను పరిశీలించారు. విద్యార్థులతో సమస్యలపై ఆరాతీవారు. కళాశాల ప్రిన్సిపాల్ విజయ్‌కుమారి, హెచ్‌ఎం మస్తాన్, ఉపాధ్యాయుడు వేణుగోపాల్ ఆయన వెంట ఉన్నారు.

## చిన్నారికి ఆర్థిక సాయం


ఆర్థిక సాయం అందిస్తున్న నాయకులు

హిందూపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): ఇటీవల రోడ్డు ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న చిన్నారికి టీడీపీ నాయకులు ఆర్థిక సాయం అందించారు. వీవర్స్‌కాలనీలో నివాసమున్న చిరంజీవి కుమార్తె మేఘన ఇటీవల పాఠశాలకు వెళ్లే సమయంలో రోడ్డు దాటుతుండగా వాహనం ఢీకొంది. విద్యార్థిని హిందూపురం ప్రైవేట్ ఆ సుపత్రిలో చికిత్స పొందుతున్న విషయం తెలుసుకున్న టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, నాయకులు ఆనంద్, రాము, మంగేష్, ఎమ్మెల్యే పీఏ బాలాజీ ఆసుపత్రికి వెళ్లి పరామర్శించి రూ.20వేలు సాయాన్ని అందించారు.

## వైభవంగా వాల్మీకి జయంతి

హిందూపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వీవర్స్‌కాలనీలో వాల్మీకి జయంతి బుధవారం ఘనంగా నిర్వహించారు. మహిళలు జ్యోతుల ఊరేగింపు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో అనంతపురం ఎంపీ అంబికా లక్ష్మీనారాయణ, టీడీపీ కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, నాయకులు ఆనంద్, అశ్వత్థనారాయణరెడ్డి, ప్రెస్ వెంకటేశ్, సాకె ఆంజనేయులు, పవన్, వాల్మీకి నాయకుడు వెంకటరమణ పాల్గొన్నారు.







## లండన్‌లో సీఎంను కలిసిన బీకే తనయుడు


సీఎంకు పుష్పగుచ్ఛం అందజేస్తున్న సాయికల్యాణ్

పెనుకొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): లండన్ పర్యటనలో ఉన్న ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడును అక్కడే చదువుకుంటున్న హిందూపురం పార్లమెంట్ సభ్యులు బీకే పార్థసారథి కుమారుడు బీకే సాయికల్యాణ్ తోపాటు లండన్ తెలుగుదేశం పార్టీ ఫోరం సభ్యుడు రామకృష్ణ మర్యాదపూర్వకంగా కలిశారు. ఏం చదువుతున్నావు..? ఎన్నిరోజులుగా ఉంటున్నావు..? తదితర విషయాలను సీఎం చంద్రబాబు అడిగి తెలుసుకున్నారు. ఏడాది నుంచి మాస్టర్ డిగ్రీ చేస్తున్నానని తెలుపడంతో బాగా చదువుకుని ఉన్నత స్థాయికి చేరాలని కల్యాణ్‌ను ముఖ్యమంత్రి ఆశీర్వదించారు.

## రైల్వే స్టేషన్‌లో చైన్‌స్నాచింగ్

హిందూపురం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలోని రైల్వే స్టేషన్‌లో బుధవారం మధ్యాహ్నం ప్లాట్‌ఫాంలో ఉన్న విజయలక్ష్మి అనే మహిళ మెడలోంచి గుర్తుతెలియని దుండగులు బంగారు గొలుసును లాక్కెళ్లారు. దీనిపై రైల్వే పోలీస్‌స్టేషన్‌లో బాధితురాలు ఫిర్యాదు చేశారు.

## పంటలపై రైతులకు అవగాహన

రొద్దం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): తురకలాపట్నం, కోగిర గ్రామాల పరిధిలోని రైతులకు వరి, మొక్కజొన్న, కంది పంటల్లో అవగాహన కార్యక్రమాన్ని వ్యవసాయశాఖ అధికారులు బుధవారం చేపట్టారు. పొలం పిలుస్తుంది కార్యక్రమంలో భాగంగా పంటలకు ఆశించిన తెగుళ్ల నివారణకు చర్యలను వివరించారు. తురకలాపట్నం రైతు సేవా కేంద్రంలో జిప్సం అందుబాటులో ఉందని వేరుశనగ, పండ్లతోటల రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయశాఖ అధికారి రాజేష్ కోరారు. కార్యక్రమంలో రైతు సేవా కేంద్రం అధికారులు నవీన్, భాను తదితరులు పాల్గొన్నారు.

## సర్పంచ్ ఆత్మహత్యాయత్నం

పెనుకొండ రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని గోనిపేటలో కుటుంబ కలహాలతో సర్పంచ్ నాగరాజు ఆత్మహత్యాయత్నానికి పాల్పడిన సంఘటన బుధవారం చోటుచేసుకుంది. గోనిపేట పంచాయతీకి చెందిన నాగరాజు కొంతకాలంగా కడుపునొప్పితో బాధపడుతున్నాడు. దీనికితోడు కుటుంబకలహాలు చోటుచేసుకోవడంతో బుధవారం మనస్థాపానికి గురై పురుగుల మందు సేవించి ఆత్మహత్యయత్నానికి పాల్పడ్డాడు. స్థానికులు హుటాహుటిన నాగరాజును పెనుకొండ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి ప్రథమ చికిత్స అనంతరం మెరుగైన వైద్యం కోసం అనంతపురానికి తరలించారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.




## గ్రామోత్సవంపై బీరు బాటిళ్లు

పెనుకొండ, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పట్టణంలో కాశీ విశ్వేశ్వరస్వామి గ్రామోత్సవం జరుగుతుండగా దుండగులు ఊరేగింపుపై బీరు బాటిళ్లను విసిరారు. పట్టణంలోని కృష్ణదేవరాయల రోడ్డులో మంగళవారం రాత్రి ఈ సంఘటన జరిగింది. కార్తీక మాసాన్ని పురస్కరించుకుని ఆలయంలో లక్ష దీపోత్సవం నిర్వహించారు. భక్తులు స్వామివారిని పట్టణంలో ఊరేగించారు. ఆ సమయంలో దుండగులు ఓ కాంప్లెక్స్ పైనుంచి రెండు బీరు బాటిళ్లను ఊరేగింపు ముందుకు విసిరారు. భక్తులు రోడ్డుపై పడ్డ గాజు పెంకులను తొలగిస్తుండగా మరో రెండు బీరు బాటిళ్లను విసిరారు. భక్తులు, బందోబస్తు పోలీసులు వెంటనే వారికోసం గాలించగా, పారిపోయారు. ఈ సంఘటనపై ఆలయ కమిటీ సభ్యులు, బీజేపీ, వీహెచ్‌పీ నాయకులు, భక్తులు ఎస్ఐ వెంకటేశ్వర్లుకు ఫిర్యాదు చేశారు.

## కొండచిలువ కలకలం

పెనుకొండ రూరల్, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): మండలంలోని వెంకటగిరిపాళ్యంలో బుధవారం కొండ చిలువ కలకలంరేపింది. కోడిని అమాంతం మింగేస్తుండగా స్థానికులు చూసి ఆందోళనకు గురయ్యారు. వెంటనే అటవీశాఖ అధికారులకు సమాచారం ఇచ్చారు. వారు ఘటనా స్థలానికిచేరుకుని కొండ చిలువను పట్టి అటవీప్రాంతంలో వదిలిపెట్టారు.

## పాఠశాల ఆవరణలో పారిశుధ్య పనులు

రొద్దం, నవంబరు 5(ఆంధ్రజ్యోతి): పెద్దగువ్వలపల్లి ప్రాథమిక పాఠశాల ఆవరణలో పారిశుధ్య పనులు చేపట్టారు. ఇటీవల కురిసిన వర్షానికి పిచ్చిమొక్కలు ఏపుగా పెరిగాయి. మట్టిదిబ్బలు ఉండటంతో ఉపాధ్యాయులు మాజీ జడ్పీటీసీ చిన్నప్పయ్య దృష్టికి సమస్యను తీసుకెళ్లారు. దీంతో ఎక్స్‌కావేటర్ సాయంతో బుధవారం పిచ్చిమొక్కలను తొలగింపజేసి పాఠశాల ఆవరణాన్ని ఆయన చదును చేయించారు.







